
# బాల



మార్చి
195

6
అ



ప్రతిభా వారి

# శ్రీ లక్ష్మమ్మ కథ

అంజలీదేవి ; నాగేశ్వరరావు ; శివరావు ; జి. వరలక్ష్మి ;

సూర్యప్రభ ; ప్రభాకర్ ; గాదేపల్లి ;

మాస్టరు కుందు - బేబి నారాయణి నటించినది.

పూర్ణా రిలీజ్...

ప్రొడ్యూసర్ & డైరెక్టర్... జి. బలరామయ్య...


పొరుగింటి పైన ద్వేషాలు
పెరిగించితే రేగు రోషాలు
మరచిపో యిక మత్సరాలు
పొరుగు సేమమే నేడు మేలు
విజయ వారి....
షావుకారు
[ఇరుగు పొరుగుల కథ]
దర్శకుడు - ప్రసాద్...
నిర్వాహకులు - నాగిరెడ్డి :: చక్రపాణి...
VIJAYA PRODUCTIO

# అమృతాంజనము

తామర తంపరగా పడుబాధల - తరుమజాలనని భయపడకు
అమృతాంజనము పేరువినినచో - అవియెల్లయు గడగడ వడకు ॥తా॥

తలనొప్పికి తలనొప్పి పుట్టును - కంటినొప్పి కనుకనబడదు
పంటినొప్పియు పలాయనంబగు - తుంటినొప్పియు తుడుచుకపోవును॥

ఏదో ఒకరూపముతోవచ్చి - యెల్లరినివియే పీకితినున్
బాధల నణచి సేదదీర్చుకొన - స్వీకరింపు మమృతాంజనమున్ ॥తా॥

రొంపదగ్గు ఎగశోషలకు - చెంపపెట్టు అమృతాంజనము
వాతము పట్లను నరముల పోట్లను - వారించెడి దమృతాంజనము ॥తా॥

తామర గజ్జి సెగ కురుపులను - తరుమ గలది అమృతాంజనము
అలసిన మేనుకు బలము గూర్చును - అమృతాంజనపు మర్దనము ॥తా॥

బుద్ధి బలంబు ప్రయోగ మధికమై - స్తబ్ధతకూడిన వారలకు
శుద్ధంబైన చురుకు తనము చవి - చూపించెడి దమృతాంజనము ॥తా॥

పని పాటులు చల్లగ చేసుకొని - మనుగడ శ్రీమంతముగ గడుపుకొన
మదిలోపలను ఉవ్విళ్లూరే - మనుజకోటికిని కైదండ యిది ॥తా॥

పట్టములందును పల్లెలయందును - పీఠంబులు నెలకొల్పుకొని
బాధా పీడిత జనులందరికిని - పరమాద్భుతసాయము చేయున్ ॥తా

"ఎప్పుడెప్పుడే బాధకలిగినా - తప్పించెడి దమృతాంజనమే"యని
పిన్నపెద్దలు పాడుచుండెడి - క్షేమ గీత మమృతాంజనము ॥తా॥

గరిమెళ్ళ సత్యనారాయణ బి. ఎ.


ఓకే, గేటు వేస్తున్నారు. కొంచెము ఆగుదాము.
?
ఎందుకాగాలి ? సులభముగా దాటగలను.
త్వరగా వెనక్కురా-రైలు వస్తోంది.
అయ్యో కాలికి దెబ్బ తగిలింది. చందూ, సహాయము చెయ్యి.
భలే, చందూ, నీవేరా ధైర్యశాలివి.
ఎంత దుర్దినమిది! ఇప్పుడు శుభ్రతకు హమాము సబ్బుతో స్నానము చెయ్యండి! "రక్షణ, ప్రథమ కర్తవ్యము" అనుమాట ఎప్పుడూ మరువకుడు !


మార్చి 10 వ తేదీ నుండి
రాగిణీ వారి
తిరుగుబాటు
వచ్చిందమ్మా! వచ్చిందీ!
ఉరుకులపరుగుల వచ్చింది!
ఉగాదిపండుగ వచ్చిందీ!
" తిరుగుబాటు "
వచ్చిందీ !

'BALA'—CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు : న్యాయపతి రాఘవరావు, బి. ఎ.

సహాయ సంపాదకురాలు : న్యాయపతి కామేశ్వరి, బి.ఎ.,ఎల్.టి.

సంపుటి ౨] మార్చి, 1950 [సంచిక 8

# శతావధానం

బాలా!

"శతావధానం" అంటే ఏమిటో నీకు తెలుసునా? 'శత' అంటే నూరు. అవధానం అంటే ఆలోచించి చేయడం. అంటే నూరుపనులు ఒకేసారి చేయడం. మనం ఒకపని, తప్పితే రెండుపనులు ఒకేసారి చేయగలం గాని నూరుపనులు ఒకేసారి చేయగలమా! కొందరు మహాకవులు శతావధానం చేయగలరు. వేరు వేరు విషయాల గురించి పద్యాలు చెప్పమంటే ఒకేసారి ఆలోచించి చెప్పగలరు! అందులో శ్రీ చళ్లపిళ్ల కవి తాతగారు ఒకరు.



మన ప్రభుత్వంవారు ఈమధ్యనే ఈ మహాకవిని గౌరవించి "ఆస్థాన కవి"గా చేశారు. జ్ఞాపకంవుందా?

బాలా! నీకు తెలుసునోలేదో, మొన్న శివరాత్రినాడు ఈ కవితాత చనిపోయాడు! మన తెనుగు దేశంలో ఒకగొప్పకవి పోయాడు. ఆస్థాన కవిపోయాడు. వారి ఆత్మకు మనం శాంతిని కోరాలి కదూ!

## అట్టమీది బొమ్మ

బాలా!

అట్టమీది బొమ్మను చూశావా! ఆ పెంకి కుర్రాడు ఎవరు చెప్మా! ఎవడో ముద్దబ్బాయి లాగ వున్నాడు. కాకపోతే వాళ్ల అమ్మ అంత ముద్దుచేసి ఎత్తుకోడమేమిటి!

"అమ్మా! చూడే!" "అమ్మా నాకు అల్లది కావాలే!" అని మారాం పెడుతున్నాడా?

అంటున్నాడో లేదో వాడికి పెళ్లాం కావాలట! ఇంతోటి అందగాడికీ వాళ్లమ్మ ఒక చక్కని పిల్లనిచ్చి పెళ్లి చేస్తుందట!

ఎవరీ అబ్బాయి? ఈ పెళ్లి మాట లేమిటి? ఆ అమ్మ ఎవరు? అని మీరు అడగవచ్చును.

అబ్బాయి పేరు మాష్టర్ కుందు. తల్లిపేరు జి. వరలక్ష్మి. వీళ్లు నటిస్తున్న ఫిల్ము పేరు ప్రతిభా వారు తీసిన శ్రీ లక్ష్మమ్మకథ.

మాస్టర్ కుందు తెనుగు తెర మీదికి బాలహాస్య నటుడుగా ఉరుకుతున్నాడు. చూడండి!

## రిపబ్లిక్ దినం

స్వతంత్ర జ్యోతులు వెలిగిద్దాం!
స్వారాజ్యరథమును నడిపిద్దాం!
బాలబాలికల మందరమొకటై
॥ స్వ ॥
క్షామరాక్షసిని తరిమి
తరుముదాం!
క్షేమ దేవతకు స్వాగత
మిద్దాం ॥ స్వ ॥
విద్యలునేర్చి బుద్ధులు పెంచీ
శరీరపోషణ గావించీ।
చేతులుకలిపీ మనసులుచేర్చి
ప్రేమమార్గ మవలంబించీ।
జనసౌఖ్యానికి పాటుపడుచు మన
మనుక్షణం కృషిచేద్దాం ॥ స్వ ॥

—వసంతరావు వేంకటరావు

## మిక్శ్చర్ పద్యం

Shoe లోనిరాయి
Ear లోని జోరీగ
Eye లోని నలుసు
Leg ముల్లు
Home లోని పోరు
E ంతింత కాదయా
V శ్వదాభిరామ
V నుర వేమ!

కూర్పు: "రామ" రాజమండ్రి




లటుకు :-ఒరే చిటుకూ! మన తెనుగుభాషలో అన్నిటికన్నా పెద్ద మాట, పొడుగాటిమాట ఏదో చెప్పగలవా?

చిటుకు :-ఓ! "అమందానందకందళితహృదయారవిందుడు."

లటుకు :-అబ్బె! అది చాలాచిన్నది. నేను చెప్పీదా? "గజానన."

చిటుకు :-అదెలాగోయ్!

లటుకు :-మొదటి అక్షరానికి, ఆఖరు అక్షరానికీ మధ్య 'జాన' వుంది. జాన అంటే 9 అంగుళాలన్నమాట.

చిటుకు :-అయితే కాచుకో. నేను అంతకన్నా పెద్దమాట చెప్ప గలను. "దిగ్గజములు" ఇందులో మధ్యన ఒక గజము వుంది తెలుసా?


లటుకు :-ఓస్! అయితే ఇదివిను: "ప్రయోజనము." ఇందులో 'యోజనం' దూరం మధ్యనుంది తెలుసా?

లటుకు :-అయితే అంతకన్నా పెద్దమాట కాచుకో: "అఖండ ముగా!" ఒక ఖండంమధ్యనుంది. ఔనా!

లటుకు :-అయితే అన్నిటికన్నా పొడుగుమాట ఇది: 'ఖగోళములో!'

# అంతే కావాలి! *

మీసాల మరిడయ్య మిఠాయి అమ్ముకొని బ్రతుకుతాడు. రోజూ ఒక పళ్లెంలో మిఠాయి పెట్టి నాలుగురోడ్ల జంక్షన్ దగ్గర కూచొని వచ్చిపోయేవారికి అమ్ముతాడు. ముఖ్యంగా పిల్లలు చాలా మంది ఆ మిఠాయి కొంటారు. ఈగలు ముసిరి, రోడ్డుధూళి పడిన ఆ మిఠాయి తింటే ఏమవుతుంది! కలరా వస్తుంది!




ఈ సంగతి తెలుసుకొని, కొన్ని కాకులు వచ్చి ఏమిటి చేశాయో తెలుసా? ఇటునించి ఒక కాకి అటునుంచి ఒక కాకి వచ్చి, ఆ మిఠాయిని "ఔటు" చేసేశాయి. మరిడయ్య కర్రతో కొట్టకుండా ఒక కాకి, తన ముక్కుతో ఆ కర్ర నేపట్టుకుంది. మిగిలిన కాకులు మిఠాయిని ఎత్తుకొని పోయాయి. ఈగలమిఠాయి అమ్మితే ఇదే శిక్ష!

# సగం పాలు

ఒక గ్లాసులో నిండా పాలు వున్నాయి. రాము, సోము ఇద్దరూ అక్కడికి చేరారు. గ్లాసులో ఉన్న పాలు చెరిసగం త్రాగుదామనుకున్నారు. కాని, సోము గబగబ ఆగ్లాసుపాలన్నీ త్రాగేశాడు!

రాము, సోముమీద ఫిర్యాదు చేశాడు.

అప్పుడు సోము ఏమి సమాధానం చెప్పాడో తెలుసా? తన వంతు పాలు గ్లాసులో అడుగు భాగంలో వున్నాయని; పైభాగంలోని పాలుకూడా త్రాగితేనేగాని అడుగుభాగం చేరలేడని, అంచేత పైభాగంలోని పాలుకూడా త్రాగవలసి వచ్చిందని సమాధానం చెప్పాడు.

కంచి కృష్ణమూర్తి (శ్రీకాకుళం)


బాల

(పిల్లల బొమ్మల పత్రిక)

చందా సాలుకు రూ౪/-

"బాల" ఆఫీసు

170, రాయపేట హైరోడ్,

మదరాసు-14.





# బుద్ధిగలనక్క

రచన : P. S. నారాయణ (బొబ్బిలి)

అనగా అనగా ఓఅడవి
ఆ అడవిలో వుందోపులి
ఆపులి కాకలి వేసింది
కాన యెల్లా కలియచూసింది

♦ ♦ ♦

ఆహారంకై అంతా వెతికింది
అటుయిటు తిరిగి అలసింది
ఏమిచెప్పుదు ఆకలిబాధ!
తిండిలేక తిరిగేపులిగాధ

♦ ♦ ♦

ఎక్కడచూసిన యేమీ లేదు
ఒక్కజంతువూ చిక్కలేదు



"టక్కరియెత్తూ చక్కగ
వేస్తా"
అనుకొని యేదో ఆలోచించె

♦ ♦ ♦

గబగబ ఓ గుహాలోదూరి
దొంగవానివలె దాగియుండె
జంతువులొస్తే చంపేదానికి
అంతులేని సంతోషంతో!

♦ ♦ ♦

అంతజిత్తుల నక్కా వచ్చింది
అడుగుజాడలూ చూసింది
"అబ్బో! శత్రువులోపలవుంది
బాబోయ్' అని పారిపోయింది

♦ ♦ ♦

జాగ్రత్తగా ప్రవర్తిస్తే
సూక్ష్మబుద్ధీ వుపయోగిస్తే
గండమైనా గడవవచ్చు
చావుయైనా తప్పవచ్చు.

♦ ♦ ♦

క్కన్నులు కాచేలాగున బావరాకకు ఎదురుచూచాం
ఖరారుగా పదవతేదీకి వస్తానంటూ కార్డువచ్చింది
గబగబ అక్కయ్యవెళ్లి ఉత్తరం పుచ్చుక చదివింది
ఘుబుక్కున నాకు బావనేడిపించాలనిపించింది

చరచర బజారుకెళ్లాను తమ్మునితోకూడా
ఛవటిసెట్టి కొట్టుకివెళ్లి కారం కొనుక్కువచ్చాము
జండాలతో యిల్లలంకరించాం చక్కగాను అందంగా
ఝట్టజట్టాలుకట్టి నేస్తాలతోకూడి వచ్చాడుమాబావ

టక్కులమారి మా అక్కయ్యకూడా నాటకమాడిందీ
ఠపీమని బావబుఱ్ఱకు వెదురుకఱ్ఱ తగిలిందీ
డండూమ్మంటూ కోపగించాడు పట్నంబావ
ఢమఢమ ఢక్కాబండితో చంటితమ్ముడెదురెళ్లాడు

తలంటుకొని నీళ్లుపోసుకున్నాడు పండగనాడు
థటకిటతోమంటూ చెల్లాయి నాట్యంచేసింది
దబదబ బల్లగుద్ది బాగుందన్నాడు మాబావ
ధర్మారావు వచ్చాడంటే కాఫీ తెచ్చియిచ్చాను


పటపట పళ్లు కొరుకుతూ బావ ఎఱ్ఱగాచూచాడు
ఫక్కున అందరం నవ్వాము; అక్కయ్య వెక్కిరింతలు
బల్ బాగుందాబావా కారంకలిపిన కాఫీ మజా
భడవా నువ్వేనా చేసిందంతా. అక్కాయేకాదా ?

రచన : కోలగొట్ల సూర్యప్రకాశరావు (అనకాపల్లి)

# "దుర్దినము" అంటే?

— కొక్కొండ వాసు భాస్కరరావు —

మాది ఒక ఎలిమెంటరీ స్కూలు. మా మేష్టారు జోగయ్య పంతులుగారు. వారం రోజులలో స్కూలును "తణిఖీ" చేయడానికి సూపరువైజరుగారు వస్తారని తెలిసింది. మా మేష్టారికి బద్ధకం ఎక్కువ. అందువల్ల మాకు పాఠాలేమీ చెప్పేవారు గాదు. కాబట్టె ఆయనంటే మాకు చాల యిష్టంగా వుండేది. సూపరువైజరుగారు వస్తున్నారు గాబట్టి ఆ వారం రోజులైనా పిల్లలకుసరిగ్గా పాఠం చెప్పమని హెడ్ మేష్టారు మా జోగయ్య మేష్టారుతో చెప్పేరు. సరేనని ఆరోజు నుంచి పాఠాలు చెప్పడం మొదలుపెట్టేరు మా మేష్టారు.



పాఠంలో ఒకచోట 'దుర్దినము' అని వచ్చింది. మనకు గాంధీ తాత చనిపోయినదినము దుర్దినమని ఉదాహరణగా చెప్పేరు. రేపు సూపరువైజరుగారు అడిగితే ఆలాగే చెప్పాలని అన్నారు. బాగా సమాధానాలు చెప్పినవారికి 'సుద్దముక్క' బహుమానంగా యిస్తానన్నారు.

వారం రోజులూ అయిపో

యాయి. సూపర్వైజరుగారు మా బడికి వచ్చారు. మా బడిలో మూడవతరగతే పెద్దదవడం వల్ల సరాసరి ఆయన మా క్లాసుకేవచ్చారు. మా మేష్టారు ఆయనని గౌరవంగా కుర్చీలో కూర్చోబెట్టేరు. సూపరువైజరుగారు పిల్లలను ప్రశ్నలు అడిగి సమాధానాలు చెప్పించమన్నారు.

మా తరగతిలో శాస్తుర్లుగారబ్బాయొకడున్నాడు. వాడి పిలక, బోడిగుండు చూసి సూపరువైజరుగారు మొదట వాడినే ప్రశ్నించమన్నారు. మా మేష్టారు సరే అని "ఒరేయి శాస్తుర్లూ 'దుర్దినం' అంటే అర్థంఏమిటిరా అని అడిగేరు సమాధానం తప్పకుండా చెప్తాడుగదా అని. శాస్తుర్లు బుర్ర గోక్కుంటూ దుర్దినమంటేనాండి? అన్నాడు. అవును త్వరగా చెప్పు అన్నారు మేష్టారు. చిట్టి శాస్తుర్లుకి చటుక్కున వాళ్లనాన్నగారు తరుచూ అనే మాట జ్ఞాపకం వచ్చింది. వెంటనే 'యద్దినం తద్దినం నాస్తి తద్దినం మమ దుర్దినం" అని అన్నాడు ఆ చిట్టి శాస్తుర్లు. అంటే ఏమిటో తెలుసా? "ఏ రోజు అయితే నాకు తద్దినం భోజనం దొరకదో ఆరోజే నాకు దుర్దినం" అని దాని అర్థం. జోగయ్య మేష్టారు కళ్లు తేలేశారు. సూపరువైజరుగారు నవ్వుకుంటూ వెళ్లిపోయారు.




## పరీక్ష చదువు

రాము: ఏంవోయ్ సోమూ! రాత్రిపూట నువ్వు ఎంత వరకు చదువుతావు?

సోము: నిద్రవచ్చేవరకు.

—పి. ఎస్. నారాయణ
(బొబ్బిలి)




# బకెట్‌లో

## [illegible] నిప్పు!

సోముకి అన్నీ కావాలి. చదువు తప్ప మిగిలినవన్నీ కావాలి. వూళ్లో గాడిదలాగ తిరుగుతునే వుంటాడు. అన్నీ చూస్తూ వుంటాడు. ప్రతీదీ సందేహమే! రోడ్డుమీద బళ్లు ఎడంచేతి వైపు నుండి ఎందుకు వెళ్లాలి? కుడి వైపునుండి ఎందుకు వెళ్లకూడదు?–ట్రాఫిక్ కాన్స్టేబిల్ రోడ్డుమధ్య అడ్డంగా ఎందుకు నిలుచోవాలి? సైకిల్‌కి వెనుకవైపున ఎఱ్ఱబిళ్ల ఎందుకు వుండాలి? ట్రాంబండీ నడుస్తూవుంటే, కిటికీలోనుండి ఎందుకు తొంగిచూడకూడదూ?–ఇటువంటి సందేహాలు కలుగుతూ వుంటాయి.

ఒకనాడు సోము అలాగ వెళ్తూ వుండగా ఒక సినీమాహాలు దగ్గర ఒక బకెట్‌మీద FIRE అని రాసివుండడం చూచాడు. గబగబ దగ్గరకువెళ్లి తొంగిచూచాడు. బకెట్‌లో ఇసకమాత్రం వుంది! వెంటనే సందేహం కలిగింది. అక్కడే దగ్గరగావున్న పెద్దమనిషిని పిలిచాడు.

“ఏమండీ! ఎంత తెలివితక్కువ వారండీ! Fire అంటే అర్థం నిప్పుకదా! ఈబకెట్‌లో నిప్పులేకుండా ఇసకపోశారేమీ! నాన్సెన్సు!” అన్నాడు.

అప్పుడు ఆపెద్దమనిషి ఇలాచెప్పాడు. "ఓయ్ తమ్ముడూ RE అంటే 'నిప్పను ఆర్పుటకు' అని దాని అర్థం. నిప్పం గాడగానే దానిమీద వెంటనే ఈ ఇసకపోసీయాలి" అ ప్పాడు.

ఇంతలోకీ ఆ సినీమాహాల్ మేనేజరు దర్జాగా సూటు బూటు వేసుకొని, నోట్లో సిగరెట్టు కాలుస్తూ అక్కడికి వచ్చాడు.

మన సోము ఏమిటిచేసాడో తెలుసా! ఆ బకెట్‌ను తీసి.. రే ఊహించుకోండి ఏమిటిచేశాడో!- జి. ఎస్. ఆర్.

రాజమండ్రీ బాలలకు మిఠాయి పంపకం



మునిసిపల్ ఆవరణలో బాలబాలికల రిపబ్లిక్ దినోత్సవం.

ఫోటో — కోట కాశీవిశ్వనాథం.




## 1

కాయల్లో చిన్నకాయ, పేలిస్తే నీటికాయ !......?

— ఎం. ఏ. శామ్యుయల్ సుందరరాజ్ (పెద్దవంగలి)

## 2

మొండి దేవాలయానికి సందేలేదు !......!

## 3

కటకటా మంచము ; కటారి మంచము ;

ఎంతరెక్కినా విరగని మంచము ?

— కొన్నా రామకృష్ణయ్యశెట్టి.

## 4

ఏరంతా ఎలుకజొక్కలే ......?

## 5

సూమిద్దెమీద ఒకచెట్టు ;

కొట్టినకొద్దీ పెరుగుతూనే వుంటుంది. ......?

## 6

ఒకటి మునుగును, ఒకటి తేలును, ఒకటి కరగును—

మూడూ కలిస్తే నీపెదవి ఎఱుపు ...?

— ఎం. తిరుపాలయ్య (కడప)

## 7

ఇంతముండలేదు — ఇల్లెక్కి పిండికొట్టింది...?

— నా॥ వెం॥ సు॥ శాస్త్రి (తెనాలి)

(జవాబులు ఆఖరు పేజీలలో)

బాలా! ఈ క్రింది పదాలేమిటో చెప్పుకోచూద్దాం! ఇవన్నీ మూడేసి అక్షరాల పదాలు. మేము మధ్య అక్షరాలు యిచ్చేశాం. మొదటి అక్షరాన్ని, మూడో అక్షరాన్ని నువ్వు పూరించాలి. మొదటి అక్షరమేమిటో, మూడో అక్షరముకూడా అదేకావాలి. అంటే నువ్వు అలాగ పూరించిన మాటను, తిరగేసి చదివినా, మళ్ళీ అదే రావాలి.

(1) — లు — : దీనిని చింతపండువల్లా, నిమ్మకాయలవల్లా, దబ్బకాయలవల్లా సంపాదిస్తాం.

(2) — లు — : బావనుచూస్తే మరదలకీ, మరదల్నిచూస్తే బావకీ యిది కలుగుతుంది.

(3) — టు — : మోసంచేసేవాళ్ళకి యిది బాగా తెలుసును.

(4) — ల — : పరిశుభ్రంగా ఉండకపోతే కళ్ళకివచ్చే ఒక సామాన్యమయిన జబ్బు.

(5) — ఘ — : ఇదిలేని మృగములుకాని, మనుష్యులుకాని, పశుపక్ష్యాదులుకాని ఉండవు.

(6) — త్స్య — : ఇది సముద్రములో దొరకును.

(7) — ర — : కావలసినదానికన్నా ఎక్కువగా దొరికితే, దానిని యిలాగు దొరుకుతున్నాయంటాము.

(8) — ఖ — : ఇది ఎప్పుడూ జీవితానికి కలగాలని ఎల్లరు కోరుతారు.

(9) — ను — : నిద్రవస్తోంటే, ముందుగా యీపాట్లుతప్పవు.

(10) — ర — : ప్రతిదేవతా ఈ రూపంలో సంబరాలు జరిగేటప్పుడు బైటికొస్తుంది.

కూర్పు : భీమాల నాగేశ్వరరావు (కాకినాడ)

(జవాబులు ఈ సంచికలో నేచూడు)



# వద్దన్నపని చేస్తే?

రచన : నందివాడ రంగనాయక

అనగనగా ఒకవూరిలో సుబ్బయ్య అనే బ్రాహ్మడున్నాడు. పాపం మనిషి అంతా బాగానే వుంటాడుగాని తల మట్టుకు బట్టతల! వాడికిదో దిగులు పట్టుకుంది. ఊరిలోని వారంతా బట్టతల సుబ్బయ్య అని అంటూవుండే వారు. వాడికది కోపంగా వుండేది. ఏంచేస్తాడు? అందరూ చక్కగా క్రాపులు దువ్వుకుంటూవుంటే సుబ్బయ్యకూడా మనసుగా వుండేది. అయ్యో నాకు జుట్టువుంటే ఎంత అందంగా దువ్వుకొనేవాడినో? అని ఎప్పుడూ ఆలోచిస్తూ వుండేవాడు. ఎప్పుడూ ఈగోడవేగాని రెండోది పట్టించుకోనేవాడుగాదు. సుబ్బయ్యకిదో తీరని విచారం గలిగింది. ఎప్పుడూ చింతయే. భార్య ఎన్నివిధముల చెప్పినా వినేవాడుకాదు. భగవంతుని సృష్టికి మనమేం చేస్తాము? ఈ మాత్రానికే ఇంత దిగులు దేనికి అని నచ్చచెప్పేది. ఎన్ని చెబుతున్నప్పటికీ పెడచెవిని బెట్టేవాడు. ఇంకా ఇంకా ఎక్కువగా మాట్లాడితే ఛీ! అవతలకు పో అనేవాడు. ఎన్ని మందులైతే వున్నాయో అన్నీ వాడి చూచాడు. ఒక్కటీ ఉపయోగపడలేదు.

సరే ఒకరోజు ఏమయిందంటే సుబ్బయ్య అడవిలోకి వెళ్లాడు. అక్కడ ఒకముని తపస్సు చేసుకుం



టున్నాడు. అప్పుడు సుబ్బయ్యకు ఒక ఆలోచన తట్టింది. ఏంచేశా డంటే గబగబా వెళ్లి ఆమునికి సాష్టాంగంపడ్డాడు. ఇంతలోకే ముని తపస్సు చాలించాడు. ఎదు రుగా సుబ్బయ్యను చూశాడు. ఎవరు నీవు? నీకు ఏంకావాలి అని అడిగాడు. అప్పుడు తన సంగతి అంతా చెప్పాడు. అది ఆమునివిని అయ్యో! పిచ్చివాడా ఇంతదానికే నీవు ఇట్లా దిగులు పడుతున్నావు. ఇంకా జగత్తు యొక్క మానవకోటిలో ఎంత మందియో వికలాంగు లున్నారు. ఇంక వారందరూ ఏమనుకో వాలి? అన్నాడు.

అదిగాదు స్వామీ! నాకు జుట్టుండాలని చాల మనసుగా ఉంది అని ఎంతో దీనంగా ప్రార్థించాడు. అప్పుడు ముని జాలి పడ్డాడు. తన ప్రభావంచేత కొన్ని మూలికలతో ఒకనూనెను తయారుచేసి ఇచ్చాడు. సుబ్బయ్య ఆనూనెను జాగ్రత్తగా ఒక గూట్లో దాచుకొని వాడుకుం టున్నాడు.

సరే ఒకరోజు ఏమయిందంటే సుబ్బయ్య ఊరికి వెళ్లవలసి వచ్చింది. అప్పుడేం చేశాడంటే భార్య రుక్కుని పిలచాడు. రుక్కూ! నేను ఈ గూటిలో ఒక నూనెసీసా పెట్టాను. అది నీవు తీయకేం! అని చెప్పి వెళ్లి పోయాడు. పోనీ అసలు సంగతి చెప్పొచ్చుగా! అది చెప్పలేదు.

సామాన్యంగా వద్దన్న పని చేస్తుంటారుగా. మన రుక్కు ఏం చేసిందంటే ఆ సీసా తెచ్చి చూచింది. దానికికూడా ఆశ పుట్టింది. ఆనూనె తలకు రాసు కొని ఆచెయ్యి ముఖానికీ, చేతు లకూ రాసుకొంది. ఆమరునాడు లేచేసరికి ముఖంనిండా, చేతుల



నిండా వెంట్రుకలు మొలచాయి. ఇంక అప్పుడేం చేస్తుంది? అందమైన చంద్రబింబమువంటి ముఖముమీద మీసాలు గడ్డాలూ మొలిచాయి. ఆకలువ రేకుల వంటి నయనములు ఆవెంట్రుకల మధ్యనుంచి భయంకరంగా కనిపిస్తేంటే, లబ్బో దిబ్బో యని మొత్తుకొంది. ఇంతలోకే సుబ్బయ్యవచ్చాడు. అంతాచూచాడు. పాపం, తానుమాత్రం ఏమిచేయగలడు? వద్దన్న పనిచేస్తే ఇంతే కదా అనుకున్నాడు.

కొంతమంది ఆడవాళ్లకు చిరుమీసాలు వుంటాయి. వారందరూ ఈ సంతతివారే గాబోలు!



శోభనాచల-యం. ఆర్. ఏ. వారి

"లక్ష్మమ్మ" లో ఒక దృశ్యము.

# మా తమ్ముడు

రచన: బ్రి వెంకటసుబ్బారావు
(విశాఖపట్నము)

మా తమ్మునికి యిప్పుడు ఏడేండ్లు. ఒకనాడు నేను నాతమ్ముడు సముద్రపు టొడ్డుకు పోయి కూర్చున్నాము. అప్పుడు నేను వాడితో 'అరే! నీవు పెద్దవాడవై ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు నీవు తెచ్చిన జీతము అమ్మకిస్తావా! నాన్న కిస్తావా! అని అడిగితిని. అప్పుడు వాడు కొంతసేపటివరకు మాట్లాడలేదు. అప్పుడు నేను వాడితో 'ఏమిరా! ఏమీ చెప్పకుండా వున్నావు. ఎవరికిస్తావు చెప్పరా' అన్నాను. అప్పుడు వాడు ఆలోచించి యిలా అన్నాడు. 'నేను ఎవరికీ యీయను. అమ్మకిచ్చినట్లైతే 'అరే! నేను యింత కాలము డబ్బుతెచ్చి వీడిని చదివించి పెద్దవాడినిచేస్తే నాకియ్యడంట!' అని నాన్న అంటారు. ఇక నాన్నకిస్తే 'అరే నేను యింతకాలము వండి వీడికి రోజూ పెడుతుంటే నాకియ్యడంట' అని అమ్మ అంటుంది. కనుక నేను ఎవరికి యీయక వారిరువురి మధ్యను పెట్టెదను. ఎవరుముందు తీసుకుంటే వారిదే. దీనివలన నాకేమాత్రపు చెడ్డ రాదు, అని అనెను. నాకు చాలా సంతోషమైంది. చూసేరా వాడి చిన్ననాటి అద్భుతపు తెలివి తేటలు. 'పొట్టివానికి పుట్టెడు బుద్ధులన్న' పెద్దవారిమాట ఖాయమని నాకు అప్పుడు తోచింది.

*********************



# గొడ్డళ్ళదాడి

రచన : మేరు సోమరాజులవరహాలు (జేంషెడ్పూరు)

బాలా! ఇదుగో నీకో గమ్మత్తు అయిన కథ చెప్పవలసి వొచ్చింది. చెబుతున్నాను, జాగ్రత్తగా విను.

ఓదగ్గిర ఓ పెద్ద అడవివుంది, పెద్దదిఅంటే యింతా అంతా గాదు. మహాపెద్దది. అందులో చిన్న చిన్న మొక్కలు పెరిగి పెద్ద పెద్ద చెట్లు, పూత, కాపు, అన్నీ అయిపోయిన మోళ్లు మొత్తం మూడుకోట్లకి పైగా ఉన్నాయి. ఆ అడవి నిన్నా మొన్నా పుట్టిందిగాదు. వేదాల కాలంనుంచీ ఉంది. ఇంకా దాని గొప్పతనం యేమిటంటే - అందులోవుండే పెద్ద పెద్ద చెట్లు, చిన్నచిన్న తుప్పలు, డొంకలు తీగెలు, అన్నీకూడా చిన్న పెద్ద అన్న తారతమ్యం లేకుండా; ఎరుసు నెరుసులేకుండా, అన్యోన్యంగా ఒకదానితో ఒకటి పెనుచుకుని, జట్టపట్టాలు గట్టుకుని, ఈ గాలైనా మధ్యదూరడానికి చోటు ఇవ్వకుండా దట్టంగా వుండేవి. చిగుళ్లు ఆకాశాన్ని అందుకుంటూ వుండేవి. కొమ్మలు సముద్రాల కొసలు చూస్తూవుండేవి. పువ్వులు ప్రపంచానికంతటికీ వాసన గొట్టేవి. పళ్లు అమృతంతో సమానంగా ఉండేవి. ఎప్పుడేనా ఒక్కసారి ఆ చెట్ల కొమ్మలు, ఆకులు, ఆ డేయి అంటే ఆగాలికి భూగోళమే గజగజలాడిపోయేది!

కొంతకాలానికి అందులో వుండే చెట్లు, నేను గొప్పదాన్ని అంటే నేను గొప్పదాన్ని అని ఈసులు పెంచుకుని, దెబ్బలాడ్డం మొదలు పెట్టేయి. రెండు చెట్లు కొమ్మలు గట్టిగా రాపాడితే యేమాతుందో నీకు తెలుసా? వెంటనే అక్కడ అగ్గిపుడుతుంది. శలవురోజున ఒక కర్రముక్కలో చిన్న గుంటదొలచి, దానిలో బిగువుగా యింకో కర్రముక్క పెట్టి గట్టిగా త్రిప్పిచూడు, వెంటనే నిప్పుపుడుతుంది.

ఇంకేముంది అడివిలో చెట్లు

చాలాకాలి చచ్చిపోయాయి. అడవులలో పుట్టే యీ అగ్గినే "కార్చిచ్చు" అంటారు. మన పట్టణాలలో ఉన్నట్టు ఆ అడవిలో అగ్గిని ఆర్పే యింజనులు మనుష్యులూ వుండరుగదూ! అందుచేత ఆ కార్చిచ్చు దాని మట్టుకు అదే కొంతకాలానికి చల్లారుతుంది. ఇలగ్గా చావగా మిగిలిన చెట్లు మరి కాట్లాడకుండా బ్రతుకుతున్నాయి.

పాపం వాటిని కూడా మొదలంటా తెగ నరికెయ్యాలని పెద్దపెద్ద గొడ్డళ్లు ఆ అడవిమీాదకి యుద్ధానికి బయలుదేరి వొస్తూవుంటే, ఆ అడవిలో ఆడుకుంటూవున్న చిన్న చిన్న మొక్కలు చూసేయి. వాటికి యెంతో భయంవేసి గబగబా ఓముసలి చెట్టు దగ్గరికి పరుగెత్తి సంగతి చెప్పేయి. అప్పుడు ఆ ముసలిచెట్టు వాటిని బుజ్జగించి, "ఎన్నిగొడ్డళ్లుమనమీాదికియుద్ధానికొచ్చినా భయంలేదు. అవిమన తాలూకు ఆకుముక్కని కూడా తెంపలేవు. కాని వాటిమధ్య మన వాళ్లే యెవళ్లైనా దూరి వున్నారంటే మాత్రం మనల్ని బ్రహ్మదేముడైనా రక్షించలేడు. అందరం చావవలసిందే. అంది.

అంటే ఏమిటో నీకు తెలి



సిందా బాలా! తెలియకపోతే విను. గొడ్డలి యెప్పుడైనా చూసేవా నువ్వు. ప్రతీయింట్లోనూ వుంటుంది. కర్రలు కొట్టడానికి వాడుతారు. దాన్ని ఉక్కుతో చేస్తారు. దాని ఓకొనను గుండ్రమైన కన్నం వుంటుంది. ఆకన్నంలో ఒకర్ర పిడిబిగించనిదే గొడ్డలితో దేనినీ నరకడానికి వీలుకాదు. కర్ర ముక్క అంటే చెట్టుతాలూకు కొమ్మేగదూ! అందుకు ఆముసలి చెట్టు అలాగ్గా అంది. చూసేవా యెంత గమ్మత్తుగా చెప్పిందో!

అలాగ్గానే మన తెలుగుజాతిని అణిచీడానికి పరాయిజాతి గొడ్డళ్లు యెన్ని మనమీదికి వొచ్చినా భయంలేదు. కాని వాటిమధ్య దూరి మనవాళ్లే యెవళ్లైనా ఉంటే మరిమనం అధోగతి పాలు కాక తప్పదు. అందుచేత నువ్వు బలే మెలుకువతో చూస్తూ ఉండి అలాటిది యేదైనా నీకంట బడితే వెంటనే దాన్నిపీకి అమాంతంగా అరేబియా సముద్రంలోకి విసిరెయ్యి. మరిచిపోయి బంగాళాఖాతంలోకి మాత్రం విసరకుమా! అది మళ్లీ మని ఒడ్డుకే చేరుకుంటుంది. హుష్యార్!

## ప్రార్థన

ఉపాధ్యాయుడు - ఏమిరా ఇంత ఆలశ్యముగా వచ్చావు?


పిల్లవాడు : దేముని గుడికివెళ్లి ప్రార్థన చేసివచ్చానండి, ఆలస్యమయింది.

ఉపా : ఏమని ప్రార్థించావు?

పిల్లవాడు. నాకు బాగా తినడానికి కావాలని ప్రార్థించాను.

ఉపా : నాకు మంచిబుద్ధి ఇయ్యమని ప్రార్థించలేకపోయావూ?

పిల్లవాడు : ఎవరికి ఏది కావాలో అది కోరుకోవాలండి.



అతిత్వరలో విడుదల




— డిస్ట్రిబ్యూటర్లు :—

ఆంధ్రా, సీడెడ్, నైజాములకు:—రాజ్యశ్రీ పిక్చర్సు లిమిటెడ్, బెజవాడ.

మైసూరు :—యశోధరా ఫిల్మ్స్, బెంగుళూరు.

వివరములకు :—

శోభనాచల పిక్చర్సు : మదరాసు - 18

# తెలివైన బుర్ర

—తుమ్మల చంద్రమౌళి (ముదునూరు)

గోపాలుడిది తెలివైన బుర్ర. ఎందుచేత నంటారా? వినండి.

గోపాలుడి నాన్నగారు గుంటూరులో వుంటారు. తాతగారు బెజవాడలో వున్నారు.

ఒకనాడు గోపాలుడి నాన్నగారు గోపాలుడిచేతికి ఒక వుత్తరం ఇచ్చి బెజవాడ పంపించారు. ఆవుత్తరంలో ఇలావుంది.

"పూజ్యులైన నాన్నగారికి, అత్యవసరంగా నాకు 98 రూపాయిలు కావాలి. వీనిద్వారా పంపించండి. ఇట్లు మీ కొడుకు-

సుందరరావు"

గోపాలుడు ఆ వుత్తరాన్ని పట్టుకొని బెజవాడలో వున్న తాతగారి దగ్గరకు వెళ్లాడు.

తాతగారు ఆవుత్తరం చదివి 98 రూపాయలు ఇచ్చారు.

గోపాలుడు అవి పట్టుకున్నాడు. బజారువెంటా స్టేషనుకి వస్తున్నాడు. త్రోవలో ఒక షాపులో ఒకమంచి ఫుట్ బాల్ ని చూచాడు. ఆ బంతిని కొనాలని బుద్ధి పుట్టింది. ఆబంతి ఖరీదు రూ 12/- చేతిలో 98 రూపాయిలున్నాయి. ఏమైతే అయింది. అని అందులో 12 రూ ఇచ్చి ఆబంతిని కొనేశాడు.


రైలెక్కి గుంటూరు వచ్చాడు. జేబులో 98 కి బదులు 86 రూపాయిలే వున్నాయి. ఎలాగ?

గోపాలుడిది తెలివైన బుర్ర అన్నానుగా? తిన్నగా, ధైర్యంగా నాన్నగారి చేతిలో 86 రూపాయిలూ పెట్టేడు.

"అదేమిట్రా! 98 రూపాయిలకు ఉత్తరం రాస్తే 86 తెచ్చావేమి?" అని అడుగుతే గోపాలుడు ఎలాగ సమాధానం ఇచ్చి దెబ్బలు తప్పించుకున్నాడో చెప్పగలరా?

తెలియకపోతే జవాబుకి ఆఖరుపేజీలలో చూడండి.





రత్నం
అతిమృదువైనది!
మైసూరు
శాండల్ సోప్

రచన : వాణీప్రసాద్ (తణుకు)

అనగనగా ఒకవూళ్లో ఒక పిసనారి ఉన్నాడు. వాడు చాలా ధనవంతుడు. చాలామంది నౌకర్లు అతనివద్ద పనిచేస్తున్నారు. ఆ పిసనారి ఎప్పుడూ తన లాభమే చూచుకొనేవాడు. చిన్న చిన్న లాభములకు కూడా ఇతరులను మోసగిస్తూ ఉండేవాడు. భీమయ్య అనే వంటవాడు ఆతనివద్ద పనిచేస్తున్నాడు. భీమయ్య వంట చాలా బాగాచేస్తాడు. సహజంగా తెలివైనవాడు కూడాను.

ఇల్లా ఉండగా సంవత్సరాది పండుగ వచ్చింది. పిసనారి పగలు చక్కని పిండివంటలు తయారు చేయించాడు. తింటే వదలలేకుండునట్లు, రకరకములైన వన్నీ చేసాడు భీమయ్య. అన్నీ బాగా ఉన్నాయి. వదలిపెట్టగలడా పిసనారి రంగయ్య! పొట్ట చెక్కలయ్యేటట్టు తిన్నాడు. రాత్రికి గులాబీజాం చేయమన్నాడు. భీమయ్య తన చాకచక్యంకొద్దీ నలభీమ పాకంగా చేసాడు. పగలు అన్నీ కడుపు నిండా తిన్నాడేమో రంగయ్య రాత్రికేమీ ఆకలిలేదు. తను తినకపోతే భీమయ్య తినేస్తాడేమో అని భయం. కాని ఆపిసనారి రంగయ్యకి ఆకలి లేకపోవటం చేత తింటే ఒకటి, రెండు తప్ప అంతా తినలేడు. భీమయ్యకు మెట్టువాటా ఇవ్వటం తప్పదు ఎల్లాగా! అని ఆలోచించాడు. తెల్లవారీదాకా ఉంటే ఆకలి బాగా వేస్తుంది. అన్నీ తనే తినొచ్చు ననుకున్నాడు. భీమయ్యను పిలచి ఇలా అన్నాడు. "భీమా! గులాబీజాంలు పాకం బాగా పీల్చుకొనేలా ఎక్కువ పాకంలో వేసావా? పాకంలో ఎంతసేపు నానుతే అంత బాగా ఉంటాయి. అట్టేసేపు అవలేనట్టుంది చేసి; రేపటిదాకా నానుతే నువ్వు చేసినందుకు బలేగావుంటాయి. అంచేత రేపటిదాకా దాచు." "సరే" అన్నాడు భీమయ్య. మర్నాడు కూడా భీమయ్యకు పెట్టడం

రంగయ్యకి ఇష్టంలేదు. బాగా ఆలోచించాడు, ఆలోచించాడు. మళ్లీ భీమయ్యను పిలచాడు. "భీమా! మనం ఓ పందెం వేసుకొందాం. ఈరాత్రి మన ఇద్దరిలో ఎవరికి గొప్ప కలవస్తే వాళ్లే అన్నీ తినేద్దాం. ఏమంటావ్" అన్నాడు. భీమయ్య "చిత్తం" అన్నాడు.

రాత్రి పడుకున్నాడు రంగయ్య, ఏమి కల వచ్చిందని చెబితే తను గెలుస్తాడో అటువంటి గొప్ప గొప్ప కలలను ఆలోచించడం మొదలెట్టాడు. చివరకు ఏదో ఆలోచించి పడుకున్నాడు.

మన పిసనారికన్నా యుక్తిపరుడు భీమయ్య. రంగయ్యవద్ద చాలా కాలంనుండి పనిచేస్తున్నాడు కనుక వాని కడుపులోని ఊహాలన్నీ తెలుసుకో గలిగాడు. పగలంతా పనిచేసి ఉన్నాడేమో మధ్యాహ్నం తిన్నవన్నీ శుభ్రంగా అరగిపోయాయి. ఆకలి మండిపోతోంది. తనుచేసినవి తినేద్దాం



రంగయ్య కల

అనుకున్నాడు. యజమాని కోప పడుతాడని భయంవేసింది. మంచి కలను ఆలోచిద్దాం అనుకున్నాడు. ఏమీ తోచలేదు. ఎల్లాగయినా రంగయ్యే మంచికల చెబుతాడు. వాడే ఇవన్నీ తినేస్తాడు. అనుకుని పడుకున్నాడు. కాని ఆకలిమాత్రం పడుకోనివ్వటంలేదు. వంట గదిదాకా వెళ్లాడు, వెనక్కొచ్చేశాడు. మళ్లీ సాహసించి వంటగదిలోకి వెళ్లాడు. మనసులోనున్న భయం పోక వెనుకకువచ్చి మంచము మీద పడుకున్నాడు. అల్లా నాలుగయిదుసార్లు వంట ఇంట్లోకి వెళ్లాడు, వచ్చాడు. నిద్రపోదాం ఇంక లాభంలేదని ఆలోచిస్తూ పడుకున్నాడు. నిద్ర పట్ట లేదు. ఇంతలోకే ఏమితోచిందో మళ్లీ వెళ్లాడు వంటగదిలోకి. ఫలహారముపళ్లెం ముందు పెట్టుకున్నాడు. ఒక్కొక్కటే లడాయించాడు. పాకంకూడా పెట్టకుండా నాకేశాడు. అప్పుడువచ్చి పడుకున్నాడు. హాయిగా నిద్రపట్టింది.

తెల్లారింది. రంగయ్య గబగబా కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేసి కూర్చున్నాడు. ఎప్పుడు తిందామా గులాబీజాంలు, అనే ఆశతో భీమయ్యను పిలచి "నీకల ఏమిటో తొందరగా చెప్పు?" అని ప్రశ్నించాడు.

"ఏమి చెప్పను ప్రభూ! రాత్రిఅంతా పాడుకలలతో నిండి పోయింది." అన్నాడు భీముడు. పాడు కలలన్నమాట వినడంతోటే తనరొట్టె నేతిలో పడింది కదా! అని సంతోషించి రంగయ్య అయితేనేంలే. నీకలేమిటో చెప్పు" అన్నాడు. "నాకల ఏంకల లెద్దురూ! ఏమంత విన సొంపుగాదు. తమరు ముందు చెప్పండి, తర్వాత నేను చెపుతాను లేండి అని భీమయ్య వినయంతో చేతులు నలుపుకుంటూ అన్నాడు.


అప్పుడు రంగయ్య తన కల మొదలెట్టాడు. "నేను రాత్రి ఒక మహాభవనంలో మణి సింహాసనముమీద కూర్చున్నాను. నాలుగు సముద్రాలతో కూడిన ఈ యావత్తు ప్రపంచానికి చక్రవర్తినయ్యాను. నా ద ర్బా రు చుట్టూ రక్షకభటులు, విచ్చుకత్తులతో కాపలా కాస్తున్నారు. నాప్రక్కన అనేకమంది సామంత

రాజులు నాపాదాలకు వంగి వంగి నమస్కరించి కూర్చున్నారు. ఎదుట అప్సరసలునాట్యము చేస్తున్నారు. మంత్రి ప్రజల అర్జీలను చదువుచున్నాడు. నేను చదరంగ మాడుతూ, అర్జీలను వింటూ నాట్యము చూస్తూ, కాలుమీద కాలు వేసుకొని సింహాసనము మీద కూర్చున్నాను. రాత్రి నాదగ్గరా ఏమిచెప్పను? చూశావా! ఎటువంటి వాడినయ్యానో రాత్రి. ఎంత గొప్పకలో; ఏదీ నీకల, తొందరగా చెప్పు. ఆకలి వేస్తోంది."

వంటవాడు చేతులు జోడించి ఏమి చెప్పుదును ప్రభూ! ఒక మాయారాక్షసి...

రంగయ్య :-రాక్షసా! ఎందుకు వచ్చింది?

భీ :-ఏమో స్వామీ! చేతితో



ఒక పెద్ద బాకునుకూడా తెచ్చించి. నాకు చంపేస్తుం దేమో ఆ కత్తితో అని భయం వేసింది. ఇంతట్లోకి కత్తినితీసి నా పీక మీద పెట్టింది. ప్రభూ! నన్నిలా ప్రాణాలతో వదలు తుందను కోలేదు.

రం :–ఏంచేసిందీ! చెప్పు, చెప్పు

భీ:–ఒకసారిగా మీద పడిందండీ

రం :–భయపడకురా! ఇప్పుడు బతికే ఉన్నావుగా! చెప్పు

భీ :–కత్తి కంఠమీద పెట్టింది. "మధ్యాహ్నం నీవుచేసిన పదార్థాలు తింటావా? ఈ కత్తిపోటు తింటావా?" అని గద్దించి మీద కురికిందండి బాబూ!

రం:–తినివేయ లేదుగదా!


భీ :–వదలిపెట్టింది కాదు ప్రభూ! చంపేస్తుందని చాలాభయం వేసింది. ప్రాణాల్ని రక్షించు కొనుటకు తినక తప్పిందికాదు! ఏంచెయ్యమంటారు బాబూ.

రం :–ఓరి దౌర్భాగ్యుడా! తినే శావ్. తక్షణమే నన్నెందుకు పిలిచావుకావు.

భీ :–ప్రభూ! అప్పుడు తమర్ని ఎలా సమీపించనండీ! మీరా సమయమున రాజాధి రాజులై రత్నసింహాసనముపై కూర్చు నియుంటే, నేను ఒక సామా న్య వంటవాడిని, విచ్చుకత్తుల హారాను తప్పించుకొని సామం తరాజులతో సభలోకూర్చుని అప్సరసల నాట్యం చూస్తూ న్న మహారాజుల వద్దకు ఏ విధముగా రాగలను బాబూ! అక్కడికీ రావాలనే చూచా ను. కాని హారావాళ్లు రాని య్యలేదు బాబూ."

అని చేతులు జోడించి మొహం దీనంగా వ్రేలాడేశాడు. రంగయ్య ఇన్నాళ్లకి తన ఎత్తుకు పైయెత్తు పడిందని విచారించాడు.

ఒకరి నొకరు మోసగించ డానికి ప్రారంభిస్తే పైయెత్తు ఉండనే ఉంది.



# ఏనుగు చేసిన మేలు

రచన : "మాధవ"

పూర్వము ఒక అడవిదగ్గర గ్రామంలో 100 మంది వడ్రంగులు కలిసి ఉండేవారు. వాళ్లు చెట్లను నరికి, చెక్కలను కోసి చాలారకాల కొయ్యసామాన్లు చేసేవారు. వాళ్లు ఆ సామాన్లను అమ్మివచ్చిన డబ్బు సమంగా పంచుకొనే వారు. ఇట్లా వాళ్లు సుఖంగా కాలం గడిపేవారు. ఒకరోజున వాళ్లు అడవినుంచి వస్తున్నప్పుడు వాళ్ల కు కుంటుతున్న ఏనుగు కన బడింది. దానిదగ్గఱకి వెళ్లిచూసే ప్పటికి దానికాలిలో ఒక పెద్ద కొయ్యముక్క గుచ్చుకొని ఉంది. వారు అప్పుడా కాలిని బాగు చేసేందుకు మొదలు పెట్టారు. అంటే, 100 మంది వడ్రంగులు 100 మంది వైద్యులయ్యా రన్న మాట. దానిని వాళ్లతోబాటు వాళ్ల గ్రామానికి తీసికొనివెళ్లి దానికాలికి కట్లు కట్టేరు. కొంత కాలానికి దానికాలు నయ మయింది. అప్పటినించి ఆ ఏనుగు వారితోబాటే ఉండి వారికి తన శక్తికొలది సహాయము చేస్తూ



ఉండేది. ఆఏనుగు వారికి తన తొండంతో చెట్లను పడగొట్టి వాటిని వాళ్ల గ్రామానికి చేర వేస్తూ ఉండేది. ఆఏనుగుకి కావల సినంత తిండి పెట్టేవారు.

ఇట్లు కొన్ని సంవత్సరాలు జరిగిన తరువాత ఆదేశాన్ని ఏలేరాజు ఆదారిని వేటకు వెళ్తూ ఈ వడ్రంగులనూ ఏనుగునీ చూశాడు. చూసి ఏనుగని ఎట్లా గైనా పొందా లనుకున్నాడు. ఆవడ్రంగుల దగ్గఱకు వెళ్లి, వాళ్లను ఏనుగును అడిగాడు. అప్పుడు ఏనుగు వెళ్లేందుకు ఇష్టంగా ఉన్నట్టు తొండం ఆడించింది. అప్పుడు ఆరాజు ఆవడ్రంగులకు, వారి కుటుంబాలకి కావలసినన్ని బట్టలు, ధనమూ ధాన్యము ఇచ్చి ఆఏనుగుని తీసికొని వెళ్లేడు.

ఆరాజు ఏనుగుని తన పట్టణానికి తీసుకొని వెళ్లి దాన్ని బలే గారాబంగా చూసేవాడు. ఆఏనుగుకికూడా రాజుమీాద చాల విశ్వాసము కలిగింది. కొంత కాలానికి ఆరాజు చనిపోయాడు. ఆసమయంలో శత్రురాజులు ఈ రాజ్యంమీాద దండెత్తి వొచ్చారు. అప్పుడు అంతఃపురంలో ఉన్న మహారాణికి తన కుమారుని ఎట్లా కాపాడాలో తెలియ లేదు. ఇట్లా భయపడుతూ ఉండగా



మహారాణికి ఒక మంచి ఆలోచన తట్టింది. వెంటనే ఆవిడ ఆ రాజకుమారుడ్ని తీసికొనివచ్చి ఏనుగుముందు పడేసి రాజ్యం మీాదికి శత్రువులు దండెత్తి వచ్చారని చెప్పింది. అప్పుడు ఆఏనుగు రాజకుమారుడ్ని వీపు మీాద కెక్కించుకొని వచ్చి శత్రువుల నాయకుడిమీాదకు వెళ్లి వాడిని తొక్కి చంపేసింది. అది సైన్యంలోని నాయకుడ్ని చంపెయ్యడంతోనే వారి సైన్యం చెల్లాచెదరై పోయినది. అంతట్లో రాణిగారు మంత్రిగారితో ఏర్పాటుచేసిపంపిన సైన్యం శత్రుసైన్యాల్ని బాగా ఓడించేసింది. ఏనుగు రాజకుమారుడ్ని తీసికొని తిరిగి రాజుగారి కోటలోకి వచ్చింది. చూశావా! ఏనుగు రాజకుమారుడ్ని, రాజ్యాన్ని ఎట్లా కాపాడిందో!

---


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీాయండి.

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీాకే తెలియగలదు.

వివరములకు:

డా॥ పిళ్లా పాపయ్యా పాత్రుడు అండ్ బ్రదరు,

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు,

కుంభకోణం బ్రాంచి;
నెం. 7, సారంగపాణి కోవిల్
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి;
నెం. 15, పుగళైపిళ్ళై వీధి,
తెప్పకొలం

# ఆడపిల్ల అదృష్టం

రచన : పిన్నింటి తౌడుబాబు

ఒకవూళ్లో పుల్లమ్మ వెంకన్న అని ఇద్దరు భార్యా భర్తలు వున్నారు. వాళ్లు రోజూ పొలంలో కష్టించి బ్రతుకుతుండేవారు. వాళ్లకి వరుసగా ఏడుగురు ఆడపిల్లలే పుట్టేరు. ఎనిమిదోసారి ఏం బిడ్డ పుడుతోందో అని చూస్తున్నారు.

"ఒసే! ఈసారి మనకి మొగపిల్లవాడు పుట్టాలి. మళ్లీ ఆడపిల్ల పుడ్తే వూరుకోను సుమా! ఆ పిల్లనీ, నిన్నూ కలిపి చంపేస్తాను! జాగ్రత!" అని కోపంగా అన్నాడు.

సరే, కొన్నాళ్లయాక వెంకన్న ఏదో పనిమీద పొరుగూరికి వెళ్లాడు. ఆరోజునే పుల్లమ్మకి నొప్పులువచ్చి మళ్లీ ఆడపిల్లే పుట్టింది!

భర్తవస్తే పాపాయిని ఏమిటి చేస్తాడో అని భయపడి, "బ్రతికివుంటే బలుసాకేనా తినవచ్చునని" ఆమె ఆపాపాయిని ఒక రెల్లుపొదలో పారేసి, ఇంటికి వచ్చింది.

భర్తవచ్చి అడిగితే-"మళ్లీ కూతురు పుట్టింది. పుట్టగానే చనిపోయింది" అని చెప్పేసింది.

ఇక్కడ, రెల్లుపొదలో పారవేయబడిన పిల్ల, దైవవశాత్తూ ఏడుగురు దొంగల చేతిలో పడింది. పాపం! ఆదొంగలు ఆ పాపాయిని తీసుకెళ్లి, అడవిలో వున్న తమ గుహాలో పెంచుతూ వచ్చారు. ఆ అమ్మాయికి లక్ష్మమ్మ అని పేరు పెట్టారు.

లక్ష్మమ్మకు 14 ఏళ్లు వయసు వచ్చింది. ఈ 14 ఏళ్లూ ఎంతో గారాబంగా పెంచారు. ఒక రోజున దొంగలు లక్ష్మమ్మని పిలిచి ఇలాగన్నారు.

"అమ్మాయీ! మేము దొంగతనానికి దూరదేశం వెళ్తున్నాము. ఇంకా ఒక సంవత్సరం వరకూ రాము. అంచేత నువ్వు గుహానుండి పైకి రాకూడదు. గుహాద్వారమువద్ద నాలుగు రామచిలుకలుంచాము. అవి

నీజవార్తలు చెప్పుతూవుంటాయి. అవి చెప్పినట్లుగా నడుచుకో!" అని చెప్పి, సంవత్సరమునకూ పనికివచ్చిన వంట సామానులు ఇచ్చారు. రోజుకొక్క అగ్గిపుల్ల చొప్పున 365 రోజులకు 365 అగ్గిపుల్లలు లెక్కబెట్టి ఇచ్చారు.

దొంగలు వెళ్లిపోయినారు. లక్ష్మమ్మ ఒక్కర్తే, చిలుకతో కాలక్షేపము చేసుకుంటోంది. అలాగ 364 దినములు గడిపింది. ఆఖరిరోజున లక్ష్మమ్మ, దొంగలు చెప్పిన మాటలు మరిచి, ఒంటి నిండా నగలూ అవీ ధరించి పక్క గ్రామం చూచుటకు వెళ్లింది.

లక్ష్మమ్మ వొంటిమీాద వున్న నగలు నరసమ్మ అనే ఒక అవ్వ చూచింది. ఆ అవ్వకి నలుగురు కొడుకులు. వాళ్లు కూడా దొంగలే! నరసమ్మ ఆ కొడుకులతో లక్ష్మమ్మ సంగతి చెప్పింది. రహస్యంగా ఆమె గుహను చూపించింది.

ఆరాత్రి ఆ నలుగురు దొంగలూ ఆ గుహాదగ్గరకి వెళ్లారు.

వచ్చాం వచ్చాం లక్ష్మమ్మా!
తలుపు తీయవే లక్ష్మమ్మా!

అని పిలిచారు. ఈ మాటలు ఆనాలుగు రామచిలుకలూ విని, "మనవారు కాదూ లక్ష్మమ్మా! దొంగలే వీరూ! లక్ష్మమ్మా" అని అరిచాయి.

లక్ష్మమ్మ తలుపు తీయ



లేదు. కాని ఆనలుగురు దొంగలూ ఊరుకుంటారా! ఆగుహాకి ఒక చోట వెలుతురు రావడానికి గాను ఒక కిటికీవుంటే ఆకిటికీ గజాలు విరిచి అందులోంచి దూరి లోనికి ప్రవేశించారు. లక్ష్మమ్మ కెవ్వుమని కేక వేసింది. దొంగలు లక్ష్మమ్మమీద ఏదో ఒక గుండ జల్లేరు. లక్ష్మమ్మ మూర్ఛ పోయింది! దొంగలు నగలు దోచుకొని పారిపోయారు. అంతేకాదు లక్ష్మమ్మ చనిపోయిందనుకొని. ఆమెను ఒక పెట్టెలో పెట్టి, నది ఒడ్డున ఆపెట్టెను పారేశారు.

అదృష్టంకొద్దీ ఆరాత్రి ఆదారినే ఆవూరు రాజుగారు పోతూ ఆ పెట్టెను చూచారు. వెంటనే, పెట్టె తెరిచి చూచేసరికి చక్కని యువతి! వైద్యుల సహాయంతో ఆ అమ్మాయికి తెలివి తెప్పించారు.

లక్ష్మమ్మ రాజుతో జరిగిన సంగతంతా చెప్పింది. రాజు ఆగుహాకి తన భటులను పంపించాడు. గుహాదగ్గరకు ఈలోపుగా ఏడుగురు దొంగలూ వచ్చేశారు. నాలుగు చిలుకలూ ఇక్కడ జరిగిన వృత్తాంతం దొంగలకు చెప్పేశాయి.

రాజభటులు ఆ దొంగలను రాజు దగ్గరకు తీసుకెళ్లారు దొంగలు ఇకముందు దొంగతనం మానుకుంటా మన్నారు.

లక్ష్మమ్మను ఆరాజు తన కొడుకి కిచ్చి పెళ్లిచేశాడు. అందరూ హాయిగా వున్నారు. కొన్నాళ్లకు ఈ సంగతి వెంకన్న వుల్లమ్మకు తెలిసింది. వాళ్లు కూడా రాజుగారి కోటకువచ్చి హాయిగా వున్నారు.

"అదృష్టం వుంటే ఇటువంటివి ఎన్నైనా జరగవచ్చు" అని ఆ నాలుగు చిలుకలు ఒక పాట పాడేయి. కథ ముగిసింది.

**తెలుసా**

ఒరిస్సా దేశంలో మన తెనుగువారు 12 లక్షలమంది వున్నారు. హైదరాబాదు సంస్థానంలో 1 కోటిమంది ఆంధ్రులున్నారు. మైసూరులో 20 లక్షలమంది, మధ్యప్రదేశ్ లో 6 లక్షలమందీ వున్నారు. వీరందరూ కలిస్తే విశాలాంధ్ర అవుతుంది.


# బలే కల!

మీమీదే!!!

రచన: పి. యస్. బి. కుమార్. & పి. యస్. నారాయణ (బొబ్బిలి)

నాకు బాల అంటే చాలా ముద్దు; ప్రేమ. దానినే పెళ్లాండాలని నాకోరిక. కనుక మానాన్నదగ్గర 100 రూపాయలు, పెళ్లి చేసుకు వస్తానని పుచ్చుకొని, తిన్నగా మద్రాసు వచ్చాను. అదుగో మద్రాసులో న్యాపతివారింటికి వెళ్లాను. ఇంటి పేరు న్యాపతివారుకాని యిల్లంతా అన్యాయం పుట్ట! నాదగ్గర ఆ అన్యాయపతివారు 50 రూ॥ పుచ్చుకొని 6 వాల్యూములు యిచ్చి "మాయేక పుత్రిక" అంటూ అంటగట్టేరు. నేను పెండ్లి చేసుకోడమంటే యిదే కామోసుననుకొని, పదిలముగా పుస్తకాలు యింటికి తెచ్చి, యిదిగోనాన్నా పెండ్లిచేసుకొన్నా, అన్నాను.

మానాన్న కోపంతో "ఓరి దద్దమ్మా! పిల్లని పెళ్లిచేసుకొం



టారుకాని పుస్తకాలను పెండ్లి చేసుకొంటారా?" అని కోప్పడి, Get away rascal!" అన్నాడు. నేను దేవుడా అని చెరువుగట్టు మీద కూర్చొని, యేడుస్తున్నాను. ఇంతలోకి మనుష్యలోకంలోని నరమానవుల చిత్రాలు చిత్రగించుటకు వచ్చిన, పార్వతీ పరమేశ్వరులు నాముందు ప్రత్యక్షమై "బిడ్డా! యేడ్చుచుంటివేల?" అని ప్రశ్నించిరి. నేను "న్యాపతివారి అన్యాయం, నాఅపసింతితనం, మానాన్న బాధ అంతా పూసగూర్చినట్లు చెప్పితిని. నా అవస్థ పార్వతీదేవి విని నాకు సహాయం చెయ్యమని స్ట్రాంగ్‌గా రికమెండు చేసింది. దాంతో నాకళ్లు జిగేల్‌మన్నాయి! నాయెదురుకుండా 16 సంIIల బాలా కుమారి చిరునవ్వుతో నిలబడ్డాది! పార్వతీ లేదు! పరమేశ్వరుడు లేడు! వెంటనే బాలా కుమారిని గట్టిగా కోపం తీరేటట్లు ఒక్క ముద్దు పెట్టుకొన్నాను. నన్ను యింత కష్టపెట్టినందులకు, ఇట్టి శుభసందేశం న్యాయపతివారికి తెలియచేద్దామనుకొన్నాను. దూరము నుంచి, కాదుసుమా కల కాదు సుమా అన్నపాట వినబడుచున్నది. కాని కళ్లువిప్పిచూస్తే కలఅని బోధపడ్డాది. అందుచే యీ ఆశాభంగవార్తనే వ్రాయవలసి వచ్చింది. కాని నాకలే నిజమైయుంటే? న్యాయపతి వారికి బాలకుమారి, కూతురు లేదన్న లోపము తీర్చదా? నాకు భార్యలేదన్న లోపము తీర్చదా? బాలకుమారే నా భార్యఅవుతే బాల పుస్తకములో అన్నీ నాకథలుకావా? ఇంతకీ యెన్ని అనుకొంటే యేమిటి! నాకు అదృష్టములేదు. మీకా ప్రాప్తములేదు. ఏది యెలాగైనా సరే యీమారు పగలెప్పుడైనా పార్వతీ పరమేశ్వరులు అగుపడితే, వారుచేసిన మోసానికి నిలవేసి నడిరోడ్డుమీద అడగనా

---

**తెలుసా**

మనుష్యులు సాధారణంగా 60 లేక 70 లేక 80 ఏళ్లు బ్రతుకుతారు. తాబేళ్లు సుమారు 200 ఏళ్లదాకా బ్రతుకుతాయి. మనుష్యులుకూడా తాబేళ్లలాగ సుమారు 200 ఏళ్లు బ్రతకడానికి ఒక మందు కనిపెట్టేరట! ఆ ఇంజక్షన్ ఖరీదు రూ 650/- లట!

అనగనగా ఒకరాజు. ఆరాజుకి లెక్కలేనంత ధనం, అధికారం, రాజ్యం ఉండేవి. ధనం సంపదతోపాటు ఆ రాజుకి అన్ని విద్యలూ వచ్చునని వాడ వాడలా పేరుపడ్డాడు. అతని పేరు ప్రఖ్యాతులు విని నానా దేశ రాజులు అతనికి కప్పం చెల్లిస్తూ ఉండేవారు. కొన్నాళ్లకి రాజుగారి ఐశ్వర్యం మరింత పెరిగింది. దేశంలో ఉన్న లక్షాధికారులంతా ఆరాజుగారి ముందు భిక్షాధికారులయ్యారు. ఇంక విద్యలో రాజుగారికి తెలియని సంగతు లంటూ లేవు. ఆకాశం మీద చుక్కలు లగాయతు సముద్రంలో నీటి బిందువుల వరకు అతను అవలీలగా లెక్కపెట్టేవాడు. చిటుక వేసినంతలో ఎటువంటి లెక్కయినా చేసేవాడు. వర్షం ఎపుడు పడుతుందో, గ్రహణాలు ఎపుడు పడతాయో భూకంపాలు ఎపుడు వస్తాయో ఇటువంటివన్నీ సులువుగా చెప్పేసేవాడు. రాజుగారి ఐశ్వర్యం చూచి, తెలివి తేటలు చూచి అంతా ఆశ్చర్యంతో ముక్కు మీద వేలు వేసుకొనేవారు.


అంతగొప్ప రాజు కూడా కొంతకాలం బ్రతికి ముసలివాడై పోయాడు. చివరికి, పాపం చని పోయాడు.

చనిపోయిన తర్వాత రాజుగారి ప్రాణం ఆయన దేహాన్ని విడిచి అనేక లోకాలలో ప్రయాణం చేసి చివరికి పుణ్యాలోకం చేరుకుంది.

పుణ్యాలోకం తలుపులు వేసి వున్నాయి. ద్వారపాలకుడు అడ్డంగా నిలబడి "ఏయ్! నీకేం కావాలి" అని అడిగాడు.

రాజుగారికి అర్థం కాలేదు. తనంత గొప్పవాడు వస్తే, గొప్ప వైభవంగా స్వాగతం ఇవ్వక "ఏయ్ ! నీకేం కావాలి" అంటాడేమిటి యీ ద్వారపాలకుడు అనుకొన్నాడు.

"ఏయ్ ! మంచి మర్యాద తెలియక్కర లేదూ? ఎవడ్ని అనుకున్నావో? నేను మహా




రాజాధి రాజును” అని గట్టిగా చెప్పాడు రాజు.

“మహారాజులూ మామూలు మనుషులూ అంతా ఒకటే! ఇక్కడ హెచ్చు తగ్గులు లేవు; రాజు, రైతు, పేద సాద ఇలాంటి తేడాలు లేవు. రాజులైతే ఎవరికి కావాలి. నీకోసం తలుపు తెరవడానికి వీలులేదు” అని చెప్పాడు ద్వారపాలకుడు.

“ఇది పుణ్యలోకం కాదూ? చనిపోయిన వారందరి జీవుల్ని ఇక్కడికి రానివ్వరూ?” అని అడిగాడు రాజు. “ఇది చనిపోయిన జీవులుండే లోకంకాదు. చావు, బ్రతుకు మీలోకంలో. ఇది పుణ్యలోకం. ఇక్కడ చచ్చిపోవడంలేదు. మీ లోకంలో కొద్దికాలం మీరు జీవిస్తారు, ఇక్కడ అలాగకాదు. యావత్కాలం, ఎల్లప్పుడూ జీవిస్తూనే ఉంటాం. భూలోకంలో మీకున్న స్వల్ప జీవితకాలం వృథా కాలక్షేపం చేసినవాళ్లు, యావత్ కాలం జీవించమంటే ఏం చెయ్యగలరు? బూడిదలో పోసిన పన్నీరు” అని ఏదో చెప్పబోతున్నాడు ద్వారపాలకుడు. రాజు అడ్డుపడి “అదేమిటి? నాజీవితం వృథా-కాలక్షేపం అంటావేం? బూడిదలోపోసిన పన్నీరు ఎందుకయింది, ఎంతమంది రాజుల్ని ఓడించాను? ఎన్ని రాజ్యాలు గెలిచాను? ఎన్ని రాజకార్యాలు చేశాను? ఇవన్నీ వృథా అంటావేం?” అని అడిగితే ద్వారపాలకుడు తగిన సమాధానం చెప్పాడు.

"రాజ్యాలు గెలిచావయ్యా! అంటే ఎన్నిరాజ్యాలు గెలిస్తే అన్నియుద్ధాలు చేశావు. అన్ని లక్షల జనాన్ని చంపావు. నీవు బ్రతకడానికి ఎంత ప్రాణనష్టం? అడవుల్లో ఉండే క్రూరమృగాలికి నీకూ తేడా ఏమిటి? నాశం, సర్వనాశం. ఇన్ని నాశనంచేశానని గొప్ప చెప్పకొనేకంటె, ఏమి సాధించావో చెప్పగలవా? ఎందుకొచ్చిన గొప్పలు? రాజా?"

"ఇంతకన్నా ఏమి సాధించాలి! ఐశ్వర్యం సంపాదించాను. నా భోషాణాలన్నీ బంగారుతో నింపాను. నాగదుల్లో రత్నాలు రాశులుపోశాను. నామేడలన్నీ వెండి తాపడం చేయించాను! ఇంకేం కావాలి?" అన్నాడు రాజు సగర్వంగా.

దానికి ద్వారపాలకుడు ఇలా ఆక్షేపించాడు. ఓ పిచ్చిరాజా! నీగొప్ప ఏమున్నది? నీ ధనమంతా ఇతరులవద్ద నించి దోచుకున్న దేకదూ? రత్నాలు రాశులు సముద్ర గర్భంలో లేవూ? వెండి బంగారాలు, భూదేవి దాచుకోలేదూ? నీ ప్రయోజకత్వం ఏముంది? పోవయ్యా" అని మరింత వెటకారం చేశాడు. రాజుగారికి కోపం వచ్చింది; "పోనీ! నా గొప్ప ధనంలో లేకపోతే, నా విద్యలో పాండిత్యంలో లేదంటావా? చూడు చిటికెలో చుక్కలు లెక్కపెట్టాను; గ్రహాణాలు చెబుతాను; భూకంపాలు, వర్షాలు ఎపుడు వస్తాయో చెబుతాను. ఇది ప్రయోజకత్వం కాదంటావా?" అని రాజు చెప్పబోతూ ఉన్నాడు.

నీవు లెక్కపెట్టినా లేకపోయినా చుక్కలు చేసే పని చేస్తూనే ఉంటాయి. గ్రహాణాలు పట్టుతూనే ఉంటాయి. భూకంపాలు, వర్షాలు యథాప్రకారంగా పడుతూనే ఉంటాయి. నీ పాండిత్యం ఎవరికి కావాలయ్యా అని రాజుగారిని ధిక్కరించాడు.

రాజు విస్తుపోయి నిలుచుండి చూస్తున్నాడు. మరోవైపునించి సందడి వినబడింది. ఒక ఊరేగింపు జరుగుతుంది. దేవతలు, దేవకన్యలూ ఉత్సవం చేసుకొంటూ మంగళ వాద్యాలతో ఊరేగుతూ, సింహద్వారంవైపు


వచ్చారు. ఆశ్చర్యం! రాజు తన కళ్లు తాను నమ్మలేక పోయాడు. ఆపల్లకీలో ఊరేగుతూ ఉన్నవారెవ్వరు? తనతోటలో పనిచేసే పేదరైతు రాజన్న?

రాజు వింతగా చూస్తూ "ఇదే మిచోద్యం? రైతు రాజన్నకీ గొప్ప ఎందుకు" అని అడిగాడు.

"ఇందులో చోద్యం ఏముంది రాజా? రైతు రాజన్న మీలాగ మనుష్యుల్ని చంపలేదు, యుద్ధాలు చేయలేదు. దోపిడీలు చెయ్యలేదు, బంది పోటులు చెయ్యలేదు. తనకు శక్తి ఉన్నవరకు కష్టపడి పని చేశాడు. పొలం దున్నాడు. పంట పండించాడు. పదిమందికి తిండి పెట్టాడు. అతనికంటె యీ గౌరవానికి అర్హత ఇంకెవరికి ఉంది? అని ద్వారపాలకుడు వివరించి చెప్పాడు.

"ఓస్ ఇదింత పనా? ఎవరు చెయ్యలేదు?" అని రాజు పెదవి విరిచాడు. చెప్పడం సులువే! ఆ పని చేసి చూపించాలి అని ద్వారపాలకుడు మళ్లీ గద్దించాడు.

"ఇపుడు జ్ఞాపకం వచ్చింది. ఒకసారి నేను పూలతోటపైపు గుఱ్ఱపు బగ్గీమీద వెళ్తూఉంటే యీరైతు రాజన్న పొలంలో దిగాను. ఇతని చెరకుతోట అంతా నీరులేక నాశనం అయిపోయి



ఉంది. దానితో నీరు లేకుండా పండే చెరకు మొక్కలు కొత్త రకం మాపొలంలో తయారు చేయించి, స్వయంగా రైతు రాజన్నకి ఇప్పించాను. దానితో ఆరకం మొక్క మారాజ్యం అంతా సాగు చేయించాం, వానితో కావలసినంత పంచదార తయారు చేయగలిగాం'' అని రాజుగారు వివరంగా చెప్పారు.

''అలాగ చెప్పండి రాజుగారూ? ఆమాట ఇంతసేపటి నించీ ఎందుకు చెప్పలేదు? చివరికి మీ జీవితం అంతా వృధా అయిపోలేదన్నమాట. ఏదో ఒక్కటైనా మంచిపని చేశారు. దానివల్ల లోకానికి కొంత మేలు కలిగింది. అయితే నిన్నుకూడా మా లోకంలో చేర్చుకుంటాం. ఈసారి లోపలికి రావచ్చు.'' అని నవ్వుతూ ద్వారపాలకుడు పుణ్యలోకం తలుపు తెరచాడు.

లోకానికి ఉపకారం చేసిన మంచి పనులు చేసిన అందరితో పాటు రాజుకూడా ఆ పుణ్యలోకంలో ప్రవేశించాడు.

కథ కంచికీ మనం ఇంటికీ.







## జవహర్ ప్రపంచాన్ని చూశాడు

అనువాదం: సూరిశెట్టి సాంబశివరావ్ బాగ్జీ

అలా పెరిగి పెద్దవాడై జవహర్ పదిహేనేళ్ల నుంచి చాలా దూరంలో నున్న విదేశాల్లో యాత్రలు చేసేందుకి మోతీలాల్ నెహ్రూ తన భార్యతోనూ, పిల్లలిద్దరితోనూ యింగ్లాండు దేశానికి పయనమయాడు. ఈ రోజుల్లో చూశావూ, కుంకుం, మనలో చాలామంది పై దేశాలకెళ్లి చూసి వొస్తూంటారు. కాని యెవరికీ పత్తాఫికరే వుండదు. కాని ఆరోజుల్లో యెవరేనా సరే దేశం వొదిలిపెట్టి మరోదేశానికెళ్లడమే బ్రహ్మాండం. యే నూటికో, కోటికో ఒకరు వెళ్లేవారు. ఓ వేళ అలా వెళ్లేవారితో సమ్మంధాలూ - నేస్తాలూ-చెయ్యటానికి యిక్కడి వాళ్లు అసహ్యించుకునే వాళ్లు. జాతినుంచి వాళ్లని వెలివేసేవారు. ఎందుకంటే సముద్రాలు దాటి అలాంటివాళ్లు అపవిత్రులై పోతారని అప్పట్లో ఓమూఢ నమ్మకం! అయినా జవహర్ నాన్నగారు మోతీలాల్ నెహ్రూ మట్టుకి భలే ఖచ్చితమైన మనిషి. ఈ పాత చింతకాయ పచ్చడి ఆచారాలకి లక్ష్యపెట్టే మనిషికాదు. అందుకని ఆయన యేమాత్రమూ వెనకాడకుండా తన కుటుంబాన్ని యెంతో దూరాన్నున్న యిం

శకుంతలా మసాని
కుంకుకి చెప్పినకథకి
అనుసరణ—

గ్లీషు దేశానికి తీసుకెళ్లి పోయాడు. అక్కడే జవహార్ని ఓస్కూల్లో చదువుకి పంపించాడు. అదెలాంటి స్కూలో తెలుసా?- అక్కడికి గొప్ప గొప్ప ధనవంతుల పిల్లలు మాత్రమే వెళ్తారు. ఆ యింగ్లాండు దేశంలో జవహార్ని వొదిలేసి తనూ, తన భార్యా, చిన్నమ్మాయితో ఐరోపా ఖండమంతా తిరిగి తిరిగి ఆఖరికి మన దేశానికి చేరుకున్నాడు.

పాపం జవహార్కి యిల్లొదిలిపెట్టి యెక్కడో దూరాన్నుండటం యిదే తొలిసారి. ఎక్కడికెళ్లినా దొరలే-అంతా వింతగా కనిపించారు. మొట్టమొదట్లో అతని కాకొత్తస్కూలు యేంవీ నచ్చలేదు. ఒంటిగా కాలం గడిపేవాడు. అస్తమాను యింటివేపే బెంగ. అక్కడ దొరల పిల్లలుంటారుగదూ! వాళ్లందర్నీ జవహార్ వొత్తి మొద్దుబద్ధాయిల క్రింద జమ కట్టేశాడు. ఎందుకంటే వాళ్లెప్పుడు మాటాడినా స్కూలు, స్కూలు పాఠాలనుగురించీ, ఆటల గురించే చెప్తుండేవారు. మరి మన జవహారో?-ప్రపంచంలో యేంటేంటి జరుగుతుందో అంతా తెలుసు. అస్తమానూ పత్రికలన్నీ చదివేవాడు. అందుకనే ఓ నాడా స్కూల్లో మేష్టారు అప్పట్లో యింగ్లాండులో జరిగిన ఎన్నికల గురించి ప్రశ్న వేస్తే అక్కడున్న వారందర్లోనూ జవహార్ ఒక్కడే దానికి సమాధానం చెప్పగలిగాడు. అప్పుడే అధికారంలోకి వొచ్చిన ప్రభుత్వం గురించి పూర్తిగా పూసగుచ్చినట్టు చెప్పగలిగాడు.

ఆరోజుల్లో జవహార్కి మన దేశంతో సమ్మంధం పూర్తిగా తెగిపోయి నట్టయింది. కాని యిక్కడ జరుగుతుండే గొప్ప గొప్ప విశేషాలన్నీ వార్తాపత్రికల్లో రోజూ చదివి తెలుసుకునేవాడు. పంజాబులోనూ, బెంగాల్లోనూ, మహారాష్ట్రంలోనూ, స్వరాజ్యంకోసం యుద్ధం చేస్తూ ప్రజలు మన దేశంలో తయారైన బట్టల్నే కట్టాలనీ, విదేశీ బట్టల్ని ముట్టనైనా ముట్టగూడ

దని యెలా నిర్ణయం చేసుకున్నారో, అవన్నీ యెప్పటి కప్పుడే తెలుసుకునేవాడు.

ఈ సంగతులన్నీ చదివేప్పుడు జవహార్‌కి ఒళ్లు ఒక్కసారిగా పులకరించేది. కాని మన సంగతి చర్చించడానికక్కడ యెవరేనా వుంటేగా!—అంచేత అతను ప్రపం



గారిబాల్డీ

చంలో వున్న యితర దేశాల్లో ప్రజలు తమ స్వాతంత్ర్యంకోసం యెలాగ పాటుబడ్డారో గొప్ప గొప్ప పుస్తకాలు చదివి గ్రహించుకునేవాడు. వాటన్నిట్లోనూ ఇటలీదేశం తాలూకు నాయకుడు 'గారిబాల్డీ' గురించి రాసిన పుస్తకాలు మాత్రం అతనికి బాగా నచ్చినై. ఆ సమయంలో ఇటలీలో అనేక చిన్న చిన్న రాజ్యాలుండేవి. ఒక్కొక్క రాజ్యానికి ఒక్కొక్క రాజు వేరేగా వుండేవాడు. ఆ చిన్న రాజ్యాలు ఆస్ట్రియా, ఫ్రాన్సు అనే యితర దేశాల సహాయంతో ఒకర్తో మరొకరు దెబ్బలాడుకోవడం మొదలెట్టారు. దాంతో వాళ్లలో వాళ్లకి ఐకమత్యం చెడిపోయింది. అందువల్ల పైదేశస్థులు ఇటలీలో బలం సంపాదించుకుని ఆ రాజ్యాలు లాక్కున్నారు. అప్పుడు గారిబాల్డీ మాంచి ఫస్టు క్లాసయిన కుర్రాళ్లందర్నీ యేరి ఇటలీ దేశభక్తులగా తయారు చేసి ఓగొప్ప సైన్యాన్ని లేవదీశాడు. అతనూ—అతని వీరసైనికులూ తమ దేశాన్ని ఆస్ట్రియా ఫ్రెంచి దేశాల బానిసత్వంనుంచి తప్పించి స్వతంత్రం తీసుకువచ్చేందుకి, దాన్ని యెంతో బలంగానూ—ఐకమత్యంగానూ వుంచేందుకి, చాలా ప్రయత్నించారు.

నెలల తర్వాత నెలలు గడిచిపోతున్న కొద్దీ జవహార్‌కి స్కూల్లో యేమాత్రమూ టయిము దొరక్కుండా వుంది. అక్కడ

వు పూర్తయి పోగానే
దంగా అతను కేంబ్రిడ్జికి
డు. కేంబ్రిడ్జి అంటే యేం
తెలుసా, కుం కుం ?—చదువు
కి ప్రసిద్ధికెక్కిన ఒకవూరు.
డే మన జవహార్ కాలేజీ
వు ప్రారంభించాడు, అక్కడ
పొందటానికి తను మూడేళ్లు
డు. తను గొప్పింటి యిం
నేస్తాలలాగా వుండాలని
క్కప్పు డతను చాలా
వితక్కువగా యిష్టాను

సారంగా యెంతో డబ్బు
పెట్టేశాడు. అది వాళ్ల
గారికి చాలా కష్టమనిపిం
తర్వాత జవహార్ తనంతట
యిది తప్పని గుర్తించుకుని
బరా ఖర్చంతా మానుకునా
అప్పుడే నెహూ్రు కుటుం
యింకొక రెక్కువయారు.
మరో బుచ్చి బేబీ చెల్లాయి
దని జవహార్ కి తెలిసింది.

(ఇంకావుం

# పాముల వాళ్లమో ! పాముల వాళ్లము



చి॥ యం. మీరా (మద్రాసు) నృత్యము

# బూరెలు

(గేయకథ)

రచన : బూర్లన్నయ్య

ఒక చిన్నపల్లెలో
కలడు బాపడొకడు
కోపమతనికి మిగుల
ముసలి తనముచేత
కాని అతని భార్య
సుగుణ వంతురాలు.

♦ ♦ ♦

పొరుగు ఊరినుండి
పెళ్లిపిలుపు వచ్చె
భార్యనింట నుంచి
బయలువెడలె నతడు
కనులార గాంచెను,
పెండ్లి వైభవమును
కడుపార భుజియించెను
పిండి వంటకములు.

♦ ♦ ♦

తనపల్లె చేరగనె
భార్యతోడ చెప్పె
పెళ్లి సంగతులన్ని
పూసగ్రుచ్చి నట్లు.

♦ ♦ ♦

ఇటులుండ ఒకనాడు
పెళ్లి వంటల్లోన
అతని కిష్టమైన
దొకటి జ్ఞప్తికొచ్చె.
భార్య చెంతచేరి
పేరు తెలియకతడు,
"వెన్నవలె మెత్తనై
గుండ్రముగ నుండును
దాని చేయవలయు."
అని చెప్పగా నామె,
"పేరు తెలియకెట్లు
చేయుదాన చెప్పు?"
'ఇటులుండు అటులుండు'.
అని నుడువునేకాని
పేరు చెప్పడతడు,
పెండ్లమేమిచేయు
కోప మతిశయింప
చివరికతడు విసిగి
గట్టిగాను కొట్టె,
భార్య ఏడ్వసాగె.
ఏడ్చి ఏడ్చి తుదకు,
"ఎటుల కొట్టినారో
చూడుడు ఒకసారి.
బూర్లవలె పొంగినది."
"అద్దుగదె! బాగుగా
పల్కితివి నీవిపుడు.
బూర్లు దానిపేరు
చేయుము యిప్పుడైన."
అనినుడువ ఆమెయు




మరుదినము చేసెను,
వలయునన్ని బూర్లు
బాపండు తినగను.

బాపనుని తెలివికి
మెచ్చుకొన రెవరైన!
భార్య ఓర్పుచూచి
జాలిపొందరె జనులు.



## రామ రామ రఘురామ!

—( * )—

"ఆహా! మనకి ఆంధ్రరాష్ట్రం ఎప్పుడు వస్తుందో కదా!" అని ప్రార్థిస్తున్నాడా ఈ అబ్బాయి?

అబ్బాయి కాదు! అమ్మాయే, చి॥ పొన్నపల్లి సుభద్ర. రామదాసు నాటకంలో రఘురాముడు వేషం వేసింది. ఎక్కడ? తుంగభద్రా అనకట్ట దగ్గర.

రచన : బోడపాటి సుందరి, కర్నూలు.

అనగ అనగ ఒకరాజు వుంటూ వుండేవాడు, ఆరాజుకి అనేక ధర్మసందేహాలు వస్తూవుండేవి. ఒకరోజు రాత్రి అతను పడుకున్నాడు. ఎన్నో ఆలోచనలు కలిగాయి. అతను అలా ఆలోచిస్తూ వుంటే, అతనికి ఆడవాళ్ళ మాటకి ఎక్కువ విలువవుందా! లేక మొగవాళ్లమాట గొప్పదా! అనే సందేహం కలిగింది. అతనికి కలిగిన ఆలోచన్ల ప్రకారం 'ఆడవాళ్ళ మాటకి విలువ ఏమిటి? ఆడదానిమాట విన్నవాడు అధోగతి పాలవడమే! మగవాడి మాటకే ఎక్కువ విలువవుంది. 'మృగరాజు మృగరాజే' అన్నారు. మగవాడంటే సింహాంతో సమానమన్నమాట. ఛ ఛ ఆడదేమిటి? దాన్నిచూస్తేనే అసహ్యం! దానికి తెలివికూడానా! మగవాళ్ళందరూ - చదవకుండా - హాయిగా షికార్లు కొడుతూ-పెద్ద పెద్ద పరీక్షలు అన్ని ప్యాసవుతారు. ఆడది ఓమూల కూర్చుని తన్నుకొని చస్తుంది పరీక్ష ప్యాసవటానికి చదవలేక. ఈ సంగతులన్నీ రేపు సభలో ఆలోచిద్దాం అని ఆరాత్రికి నిద్దరపోయాడు.

వుదయాన్నే లేచి సభ ఏర్పాటుచేసాడు. మంత్రులు, సామంత్రులు, రాజోద్యోగులు, పుర జనులతో సభ కిట కిట లాడుతూ వుంది. రాజు చెప్పాడయ్యా తనకి నిన్నరాత్రి కలిగిన సందేహాన్ని ఓపెద్ద ప్రశ్నక్రింద! 'ఈ సభలో చెప్పండి ఆడవాళ్ళ మాట గొప్పదా? లేక మగవాళ్ళ మాటకి ఎక్కువ విలువవుందా!

అందరూ కొంచెంసేపు ఆలోచించారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. రాజుతో ఏమంటే ఏం చిక్కో అని. ఆఖరికి రాజు గద్దించి ఏం? ఎవరూ మాట్లాడరేం? మంత్రీ నీవైన చెప్పు అన్నాడు. అప్పుడు మంత్రి అన్నాడు: ఆడవాళ్ళమాటకే ఎక్కువ విలువ వుందండీ. ఆడవాళ్ళమాట విన్న ప్రతివాడు గొప్పవాడయ్యాడు. ఆడవాళ్ళవలనే ప్రతి మగవాడు

గొప్పవాడయింది. ఆనాడు విశ్వామిత్రుడు, హరిశ్చంద్రుడు అంటూ మొదలు పెట్టబోయాడు.

ఛత్! నీవుపన్యాసం చాలించు. యిప్పుడు మీరంతా చెప్పండి అని వుద్యోగుల అందరివైపు తిరిగాడు. అందరూకూడా మంత్రే సరియైనమాట అన్నాడని మంత్రిపక్షానే ఆమోదించారు. ఆడవాళ్ళమాటకే ఎక్కువ లువవుంది. ఆడవాళ్ళయొక్క మాటే గొప్పది అన్నారు.

నామాట కాదని మంత్రి పక్ష వుంటే?

అప్పుడు వాడు అన్నాడు రాజా! నాభార్య అందిగదా ఎప్పుడూ అందరూ ఏది అవున అంటారో అది నీవుకాదు అ దానికి ఎదురుగా నిలబడవలసింది అంది. అంచేత నా భార్యమాట ప్రకారం మీపక్షం చేరాను అన్నాడు.

ఇప్పుడు మీరు చెప్పండి ఎవర గొప్ప?

రాజుకి కోపం వచ్చింది. యింతలోకే అందరిలోకి ఒకడు మటుకు రాజుపక్షాన అవలంబించాడు. రాజు ఒకడైన తనపక్షం వున్నందుకు సంతోషించాడు ఎక్కువగా



అప్పుడురాజు తన పక్షం వున్నవాడినియిలా అడిగాడు: నీ వెందుకు నాపక్షం వున్నావు. యింత మందీ

# అజ్‌గుడ్
## విచిత్రగాథ...



అనువాదం : "బాపు"

పూర్వం పర్షియా దేశంలో ఓ రాజ్యంవుండేది. ఆ దేశపు రాజుకు ఒక్కడే కొడుకు. అతని పేరు అజ్‌గుడ్. అంటే అజ్‌గుడ్ యువరాజన్నమాట.

అజ్‌గుడ్ చాలా తెలివిగల వాడు, మంచివాడు. ఎంతో దయగలవాడు. కానీ అతనిదగ్గర ఒక గొప్ప లోపంవుండేది-అతను పిరికివాడు.

అజ్‌గుడ్ ఇరవయ్యో ఏట వాళ్ళ తండ్రి చనిపోయాడు. తర్వాత అజ్‌గుడ్‌ని రాజు చేయడానికి అన్నీ సిద్ధంచేశారు. కానీ ఆరాజ్యంలో పూర్వంనుంచీ వస్తూన్న ఒక ఆచారంవుంది. అదేమిటంటే ఎవరినయినా రాజు చేయబోయేముందు అతడు ఒక పెద్ద సింహంతో పోరాడాలి. దీనికోసం ప్రత్యేకంగా ఒక సింహాన్ని కోటలో వుంచేవారు. సరే పట్టాభిషేకానికి ముందు రాత్రి వజీరు (పర్షియాలో మంత్రిని వజీరంటారు) యువరాజుతో చెప్పాడీ సంగతి.

ఈ విషయం తెలియగానే మన పిరికి యువరాజుకి గుండెల్లో రాయిపడింది. బతికితే బలుసాకేనా తిని బతకవచ్చు. ఈ సింహంతో పోట్లాడి చచ్చేకన్నా రాజ్యంవదలిపోతే మంచిదిరా! దేముడా! అనుకుని ఆ రాత్రే పారిపోవడానికి నిశ్చయించాడు.

అందరూ పడుకున్నాక కావలసినడబ్బు తీసుకుని గుర్రంఎక్కి ఉడాయించాడు. యిలా మూడు రోజులు ప్రయాణంచేసి ఒకవూరు చేరుకున్నాడు. ఆవూరు చుట్టూ అరణ్యామయమే. యింతలో అతనికి మృదువైన మురళీ స్వరం

వినిపించింది. తిరిగిచూస్తే చుట్టూ దగొ్రెలు మేస్తూంటే ఒక చెట్టునీడని కూచుని ఒకకుర్రాడు మురళిమీద పాడుతున్నాడు. అజ్ గుడ్ గుర్రం దిగివచ్చి ఆ కుర్రాడిపక్కన పచ్చని పచ్చిక మీద కూర్చున్నాడు. అంత తీయని సంగీతం ఎక్కడా వినలేదనిపించింది. పాట అయిపోయిన తర్వాత ఆగొ్రెల మేపరి తాను దగ్గరేవున్న ఒక గొప్పరైతు దగ్గర పనిచేస్తున్నానని చెప్పాడు. ఆ కుర్రాడితో తనుకూడా ఆ రైతుయింటికి వెళ్ళాడు. ఆరైతు యితన్ని ఆహ్వానించి ఎంతో గౌరవం చేశాడు. ఆకలి దప్పులు తీర్చుకున్నాక తానక్కడికు ఎలా వచ్చాడో రైతుకి చెప్పడం మొదలెట్టాడు. 'నేనిక్కడి కెందుకొచ్చానో' ఎవడినో అని మీకాశ్చర్యంగా వుండచ్చు. కొన్ని కష్టాలుండడంవల్ల యిలా వచ్చేయవలసి వచ్చింది. నేనొక రాజ్యపుయువరాజును. నాపేరు చెప్పలేనందుకు క్షమించండి. అదొక రహస్యం.

యీ ప్రవేశం నాకెంతో బాగుంది. యిక్కడే కొన్నాళ్ళు గడపడానికి అనుమతి యిస్తారా? దీనికి ప్రతిఫలంగా నాదగ్గర పుష్కలంగా ధనంవుంది-యిస్తాను, అన్నాడు. కానీ ఆరైతు "మీకెన్నాళ్ళుండ దలచుకుంటే అన్నాళ్ళుండండి. ఏం అభ్యంతరంలేదు. కానీ మళ్ళీ ప్రతిఫలం గురించిమాత్రం మాకేం వద్దు" అని కుర్రాడివైపు తిరిగి 'ఒరేయ్ ఇస్రిల్. ఈయన్ని అలా ఆతోటలవైపుకు తీసుకుని వెళ్ళు" అన్నాడు.

సరే ఇస్రిల్ తన మురళిని పట్టుకొని అజ్ గుడ్ తో బయలుదేరాడు. కాసేపు ఆతోటల యొక్క సౌందర్యాన్ని చూచి ఒకచోట చల్లటి నీడలో ఒక పెద్ద రాతిపక్కన కూచున్నారిద్దరూను. ఇస్రిల్ హాయిగా వేణుగానం చేస్తూంటే ఆచల్లటి నీడలో అజ్ గుడ్ ఒళ్ళే మరచిపోయి ఎప్పుడూ యిలాగుంటే ఎంత బాగుండును అనుకున్నాడు. యింతలో ఇస్రిల్ మురళి వూదడం ఆపి-యిక తొరగా యింటికి పోదాం రండి అన్నాడు. అజ్ గుడ్ అంత తొందరేం? యింత హాయిగా వున్నచోటు విడిచి




అప్పుడే వెళ్ళడానికి బుద్ధవటం లేదు అన్నాడు. ఇద్రిస్ అబ్బే మనం వెళ్ళిపోవాలి బాబుగారూ. ఇక్కడ సాయంకాలం పడగానే చుట్టుపక్కల అడవుల్లోంచి సింహాలొస్తాయి బాబూ, ఓమా ఇల్లాగే నేను కొంచం ఆలస్యం చేస్తే మయిందో చూడండి అని చెయ్యి చూపించాడు. మోచేతి నుంచి ఒక పెద్ద మచ్చవుంది. అజ్ గుడ్ మొహం వెల వెలా పోయింది.

గబా గబా యింటికి పరిగెత్తాడు. రైతుతో తను మళ్ళీ అక్కడ వుండదలచుకొన్న తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాననీ యింకా ముందుకు వెళ్ళాలి సుందనీ చెప్పి యిక ఆవూరు వదలి గుర్రంమీద ఒకటే దౌడు తీశాడు.

మళ్ళీ యువరాజు యింకో మూడు రోజులు ప్రయాణం చేశేప్పటికి ఒక ఎడారి ప్రదేశం చేరుకున్నాడు. మధ్యలో అరబ్బీ గుడారాలు కనిపించాయి. తనూ తనగుర్రం కూడా అలసిపోయి వున్నారు. కనుక ఆగుడారాల వైపు వెళ్ళాడు. అక్కడ షైకు

యితన్ని చాలా గౌరవించాడు. రైతుదగ్గర చెప్పినట్లే చెప్పిఅజ్ గుడ్ అక్కడే కొన్నాళ్ళపా టుంటానన్ని అన్నాడు. షైకు అలా గేఅని తన దగ్గరనున్న గుర్రాల్లో కన్నిటిలోకీ మణిలాటిదైన ఒక మేలిజాతి గుర్రాన్నిచ్చాడు వేటా డేందుకు.

వేటలో మన యువరాజు జూపించిన శక్తి సామర్థ్యాలు చూచి మెచ్చుకుని ఆషైకు అజ్ గుడ్ని తనసేనలో చేర్చుకుంటే బాగుంటుందని వూహించి యిది అతనితో చెప్పాడు. కానీ ఆషైకు ఏమన్నాడంటే "నువ్వు నా సైన్యంలో చేరబోయే ముందు నీధైర్య సాహసాలు రుజువు చేసుకోవాలి. అప్పుడు నీమీద మాకు యింకా నమ్మకం కుదురు తుంది. అదుగో చూచావూ-అదక్షిణంవైపు కొంత దూరం వెడితే అక్కడ నీకు కొండలూ గుట్టలూ అడవులూ కనిపిస్తాయి. అక్కడ ఎన్నో సింహాలు నివ సిస్తూంటాయి. తెల్లవారే బల్లెం, డాలూ పట్టుకుని నీ పిగుర్రంమీద అక్కడికెళ్ళి ఒకసింహాన్ని చంపి దానిచర్మం పట్రా. అప్పుడు యుద్ధసమయంలో నీమీద ఆధా రపడి యుండవచ్చుననే ధైర్యం మాకుంటుంది."

యిది విన్నప్పటికీ అజ్ గూడ్ వున్న వుత్సాహం అంతా ఎగిరి పోయింది. సింహంపేరు విన్న ప్పటికీ యిక అక్కడుంటే లాభం లేదని, దక్షిణంవైపు సింహా లున్నాయని చెప్పారుకదు. ఉత్త రంవైపుకి దాడుతీశాడు.

మర్నాడు సాయంకాలాని కల్లా ఒక అందమయిన రాజ్యం చేరుకున్నాడు.

అలా వీధుల్లో వెడుతూ ఒక చక్కటి భవనం చేరుకున్నాడు. లోపల అమీరు, అమీరు యొక్క కూతురు, చక్కని చుక్క పెరిచాన్ కూర్చుని వున్నారు. అజ్ గూడ్ ఎంతో గౌరవంతో ఆహ్వానింప బడ్డాడు, కాసేపుండి అమీరు ఆరాత్రి విందుకి ఏర్పాట్లు చేయించడానికి వెళ్ళాడు. రాకుమారి ఆభవన మంతా చూపించింది యువ రాజుకి. గదులన్నీ బంగారం తోనూ రత్నాలూ, కెంపులూ



మొదలయిన రాళ్ళతో అలంకరింపబడి వున్నాయి.

రాత్రి విందుకు భవనం అంతా దీపాలతో పట్టపగలులా వుంది. ఎంతోమంది అతిథులొచ్చారు. కొంతసేపుండి అజ్ గూడ్ రాకుమారుని వీణవాయించమని అడిగాడు. యువరాజుకి సంగీతమంటే అంతయిష్టం. రాకుమారి అలా వాయిస్తూంటే హాయిగా వింటూ అతను గబుక్కున వులిక్కిపడ్డాడు. ఎందుకంటే పెద్ద గర్జనలాగ ఒకశబ్దం వినబడింది. అదేమిటని రాకుమారిని అడిగాడు. ఆమె పకపకానవ్వి, అదా-మా కాపలావాడు బొలక్ ఆవలిస్తు నట్టున్నాడు" అంది. యువరాజు యిదేమిట్రా ఆవలింత యిలా గుందని ఆశ్చర్య పొయ్యాడు.

అతిథు లందరూ వెళ్ళిపోయారు కాశేపటికి పెరిచాన్ కూడా నిద్రపోయింది. అజ్ గూడ్ మాత్రం అమీర్‌తో బాగా రాత్రివరకూ మాట్లాడుతూ కూచున్నాడు. కాసేపటికి యిక నిద్రపోదామని గది యివతల

మేడ మెట్లదగ్గరికి రాగానే అజ్‌గూడ్ ఓమాటు పైకిచూచాడు.

ఒక్కమాటు గుండాగిపోయి నట్లయింది. పైన పైమెట్టుమీద ఒక పెద్ద సింహం పడుకునివుంది. యువరాజు మెలిమెల్లిగా అమీరు వెనకాలకు జరుగుతూ వణుకుతూన్న కంఠంతో, "అదేమిటి"? అన్నాడు. అమీరు "వాడే బౌలక్ - మా కాపలావాడు - మా పెంపెడు సింహం. నువ్వు ఏం భయంలేకుండా వుంటే ఏమీ చెయ్యదు. కానీ నువ్వు భయపడుతున్నావని ఏమాత్రం పసి కట్టినా వూరుకోడు" అజ్‌గూడ్ బాబోయ్ నాకు బలే భయం వేస్తోంది. నేను పైకిరాను. యీ గదిలోనే సోఫామీద పడుకుంటానని వెనక్కి వచ్చేశాడు.

(మిగిలినకథ వచ్చేనెల)

# ఫ్రెంచిలీవు

"కల్చరల్ అన్నయ్య"

జనవరి సంచికలో ఫ్రెంచిలీవుగురించి రాశారు. అందుమీదట నేను డిక్షనరీ చూస్తే అందులో ఇలా రాసివుంది.

"ఫ్రెంచిలీవు అంటే ఇతరులతో చెప్పకుండా, ఇతరుల అనుమతి తీసుకోకుండా వస్తువులను తీసుకోడం."

ఫ్రెంచి సోల్జరు ఏదేనా దేశం ముట్టడిస్తే, ఆదేశంలోని వస్తువులు వారి ఇష్టం వచ్చినట్టు దోపిడి చేసేవారట; అధికారులను అడగకుండా." ఆ తరువాత, ఎవ్వరితోను చెప్పకుండా వెళ్లిపోవడం అనేఅర్థంవచ్చింది.

# గమ్మత్తు పద్యం

కూర్పు: మ. వెంకటేశ్వర్లు
(అనంతపురం)

O యమ్మ your కుమారుడు
మా house న milk, curd
మననీడ్ madam
Go యెద మెచ్చటికైనను
Our brother ల సురభులాన
మంజులవాణీ!

## అసలు పద్యం

ఓ యమ్మ నీ కుమారుడు
మాయింటను పాలు పెరుగు
మననీడమ్మా!
పోయెద మెచ్చటి కైనను
మా అన్నల సురభులాన
మంజులవాణీ!

# వెంకయ్య తెలివి

రచన : గుండల నరహరిశాస్త్రి, ఏలూరు

అనగా అనగా ఓవూళ్లో వెంకయ్య అనే తుంటరి కుర్రవాడు గలడు. అతనికి కొంత మంది స్నేహితులు గలరు. వాళ్లు డబ్బు సంపాదించవలెనని తలంచి వెంకయ్య హనుమంతుడు వేషం అతని స్నేహితులు వానర్ల వేషము వేసికొని అవూళ్లో వాళ్లని సంతోషపెట్టి డబ్బు సంపాదించు చుండెడివారు.

ఆవూళ్లో ఎక్కువ డబ్బు రానందున ప్రక్క వూరునకు పోయి ఎక్కువడబ్బు సంపాదించవలెనని తలంచి ప్రక్కవూరునకు పోవుచుండగా దారిలో పెద్ద అరణ్యము వచ్చెను. అప్పటికి చీకటి పడెను. వీరందరు అక్కడ సామానులు దించుకొని విశ్రమించుచుండగా ఒక రాక్షసి 'నరవాసన, నరవాసన' ఎక్కడ! అని అరచుచు వచ్చుచుండెను. వీరందరు భయపడిరి. ఇంతలో మన వెంకయ్యకు మంచి ఆలోచన తోచినది.

వెంకయ్య స్నేహితులతో ఇట్లనెను "మీరు దబ్బున వానరుల వేషము వేసుకొండి. నేను హనుమంతుడు వేషము వేసుకొందును. హనుమంతుడనిన రాక్షసులకు చాలా భయము.



కనుక ఆలస్యము చేయకుండ దబ్బున వానరు వేషము వేసుకోండి. నేను హనుమంతుడు వేషము వేసుకొందును. అని చెప్పెను.

వారు వెంటనే వేషములను వేసుకొనిరి, తరువాత రాక్షసి వచ్చి చూడగా హనుమంతుడు, వానరులను చూచి పూర్వపు రాముని కాలములో ఆంజనేయుడే అనుకొని భయపడి ఆయడవిని విడిచి పారిపోయెను.

బాలలూ! చూచారా, మన వెంకయ్య తెలివి.

తెలివిచేత ఎంతగొప్ప పనియైనను సాధింపవచ్చును.

---

## ఈ పని మీరు చేస్తారా! * ఒద్దు సుమండీ

అనకాపల్లిలో ఒక బడికుర్రాడు ఒక గోలీకాయని నోట్లో వేసుకొని, "హూంత్ గారడీ! గోలీకాయని మాయం చేస్తాను చూడండి!" అంటూ, గమ్మత్తుగా ఆ గోలీకాయని చేతితో వేళ్ల మధ్యన ఎవ్వరూ చూడకుండా తీసేసి గారడీ చేశాడు.

ఈవింత చూస్తున్న ఒకటోక్లాసు అబ్బాయి తానుకూడా గారడీ చేస్తానంటూ నోట్లో గోలీకాయ మింగేశాడు! ఇంకేముంది! సరదాకైనా ఇటువంటిపనులు మనం చేయవచ్చునా?

—కొంట్రేగుల సన్యాసినాయుడు (అనకాపల్లి)

# స్వర్గంలోకాలు

రచన : కర్రా సూర్యనారాయణశాస్త్రి


పూర్వం ఒకప్పుడు నారదుడు స్వర్గలోకం చూడటానికి వెళ్లాడు. భూలోకంలో మంచి మంచి పుణ్యాలు చేసినవాళ్లూ, యుద్ధాలలో చచ్చిపోయిన వాళ్లూ; యజ్ఞాలు చేసినవాళ్లూ, చాలామంది అక్కడ స్వర్గ సుఖాలు అనుభవిస్తున్నారు. అవన్నీ చూచుకుంటూ నారదుడు అడంతా తిరుగుతున్నాడు. మళ్లీ అల్లా వెడుతూండగా ఒకచోట ఒక బంగారపు సింహాసనంమీద ఒక కాలుమాత్రం కూర్చుని ఉంది. ఇదేమిట్రా! ఇక్కడ కాలొక్కటిమాత్రమే ఉంది. తతిమ్మాశరీరం ఏమీ లేదు అని ఆశ్చర్యంతో కొంచెంసేపు చూసి వెళ్లిపోయాడు.

తరువాత కొన్నాళ్లకి నారదుడే నరకలోకం చూద్దామని వెళ్లాడు. అక్కడ ఓరిబాబో! అఘాయిత్యాలాడిన వాళ్లూ, ఎన్నో ఎన్నో రకాలవాళ్లు అనేక రకాల బాధలు పడుతున్నారు. వాళ్లం దర్నీ చూసుకుంటూ అల్లా అల్లా వెళ్లగా వెళ్లగా ఒకచోట ఒక కాలు లేకుండా తతిమ్మా శరీరం అంతా ఉంది. ఆ శరీరాన్ని సన్నటి సూదిమేకులమీద పడు కోబెట్టి వూలాలతోటి పొడు స్తున్నారు యమభటులు. ఆ చిత్రంచూచి స్వర్గంలో చూసిన ఒంటికాలుకీ, ఇక్కడ కాలు మాత్రమే లేని ఈ శరీరానికీ ఏమయినా సంబంధం ఉండి తీరా లనుకుని యమధర్మరాజు దగ్గ రకి వెళ్లాడు.

నారదుడంటే ఎవరో తెలుసా? ప్రపంచాన్నంతనీ సృష్టించిన బ్రహ్మగారి కొడుకు. కనుక యమధర్మరాజు నారదుణ్ణి దూరాన్నుంచి చూస్తూనే లేచి ఎదురుగావచ్చి దర్బారులోకి తీసుకెళ్లి సింహాసనంమీద కూర్చో

పెట్టాడు. కాళ్లుకడిగి పూజించి, మహానుభావా! ఏదో విశేషం లేందే మీవంటి మహానుభావులూరికేరారు. అదేమిటో సెలవిస్తారా! అన్నాడు. నిజమే పెద్దవిశేషమే ఉంది. నెలరోజుల క్రిందట ఒకమాటు స్వర్గంలో తిరుగుతూంటే అక్కడ ఒక్క కాలుమాత్రం సింహాసనంమీద కూర్చుని ఉండి ఇక్కడ ఇవ్వాళ తిరుగుతూంటే కాలులేని శరీరమంతా నానా బాధలూ పడుతోంది. ఇందులో విశేషమేమిటో మిమ్మల్నడిగి తెలుసుకుందామని వచ్చాను. అన్నాడు నారదుడు. ఇప్పుడు యముడు అవునవును, అది విచిత్రమయిన విషయమే. వినండి.

భూలోకంలో అక్రమపురం అని ఒకపట్టణం ఉంది. ఆపట్టణాన్ని విక్రమసింహుడని ఒక రాజు పాలిస్తూండేవాడు. అతనికి లేక లేక చాలాకాలానికి ఒక కొడుకు పుట్టాడు. వాడికి సుగుణవంతుడని పేరుపెట్టుకొని తల్లిదండ్రులు చాలాగారంగా పెంచుకున్నారు. వాళ్లగారం ఎక్కువటం మూలాన్న ఆ కుర్రాడు చెడ్డస్నేహాలు ఎక్కువగా చెయ్యటం మొదలుపెట్టాడు. తూరీగల్ని పట్టుకుని తోకలకి ముళ్లుగ్రుచ్చి ఆడిస్తూండటం, కప్పలమీద రాళ్లువిసురుతూ అవి ఏడుస్తూంటే తాను నవ్వటం ఇల్లాంటి చెడ్డ పనులు చేస్తూండేవాడు. పేరు సుగుణవంతుడే అయినా నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉందో వాడిలో సుగుణాలు అన్ని వున్నాయి. వాడు పెద్దవాడయ్యాక తండ్రి తరువాత తనే రాజ్యానికి వచ్చాడు. రాజ్యం పరిపాలిస్తూన్నా ప్రజలందర్నీ నానా బాధలూ పెడుతుండేవాడు. పుట్టినదగ్గర్నుంచి చచ్చి



పోయే వరకూ అన్నీ పాపకార్యాలే చేసాడు. అందుచేత చచ్చిపోయే సమయాన్న యమదూతలు వెళ్లి వాడిజీవాన్ని తీసుకువస్తున్నారు. దారిలో విష్ణుదూతలు ఎదురయ్యారు. ఈరాజు అన్నీ పాపాలే చేశాడు కదా! మీరెందుకు వస్తున్నారు? అని వాళ్లని వాళ్లు అడిగారు. అప్పుడు వాళ్లు ఇల్లా చెప్పారు.

ఈ రాజు అన్నీ పాపాలే చేసాడు. కాని, ఒకరోజున వీడు వేటకు వెళ్లి వస్తున్నాడు. దారిలో ఒకళ్ల యింటిముందు ఒక ఆవు కట్టేసి ఉంది. ఆ ఆవుకి దానియజమాని తట్టలో చిట్టు పెట్టి వెళ్లిపోయాడు. కాని ఆచిట్టుతట్ట దానికి అందకుండా దూరంగా ఉంది. దాన్ని అందుకోటం కోసం అది చాలా బాధపడుతోంది. ఆకలితో బాధపడుతోంది. ఇల్లా ఉండగా ఈ రాజు ఆదారిన వస్తున్నాడు. ఆ చిట్టుతట్ట ఈతని దారికి అడ్డంగా ఉందని ఒక్కతాపు తన్నాడు. అదివెళ్లి ఆ ఆవు ముఖానికి దగ్గరగా పడింది. ఆచిట్టుతిని ఆ ఆవు చాలా సంతోషించింది. తెలియకుండా అయినా ఈరాజు ఆనాడు అందరూ పూజించదగ్గ గోమాతకి ఆహారం అందించి పుణ్యం కట్టుకున్నాడు. అయితే కాలుతో తన్నాడుకనుక కాలు మాత్రమే స్వర్గంలోకి తీసుకుపోతాం అన్నారు. సరే ఈకాలు తెగకొట్టడం కూడా ఒకవిధమైన నరకశిక్షే అని యమదూతలు కాలునరికి ఇచ్చేశారు.

అది ఆకాలు. ఇది ఈవిషయం. అని యముడు చెప్పగా నారదుడు చాలాబాగుంది ఈకథ అని తెలియకుండా చేసిన ఒక చిన్న పుణ్యకార్యానికే అంత ఫలితం ఉందికదా, ప్రజలందరూ తెలిసి పెద్ద పెద్ద పుణ్యాలు చేస్తే ఎంతెంత ఫలితాలయినా అనుభవించ వచ్చునుగదా! అనుకుంటుంటూ లోక సంచారానికి బయలుదేరాడు. ఇంక మనం?

**తెలుసా**

స్పెయిను దేశంలో సెర్వారా అనే పల్లెటూరిలోవున్న ప్రతీవానికీ చేతికి, కాళ్లకీ మామూలుగా 5 దేసి వేళ్లుకాక, 6 లేక 7 డేసి వేళ్లు వుంటాయట, చేతికి 5 వేళ్లు చొప్పునవున్న మననిచూసి వాళ్లు నవ్వుతారట!

# దాగుడు నాయకులు

ఈ క్రింది వాక్యాలలో కొందరు నాయకులు దాగున్నారు. పోల్చుకో!

1. మనిషినై పుట్టినందుకు, చదువు సంధ్యలు లేకుంటే మానె, హృదయమైనా వుండొద్దూ!
2. అంత మాత్రానికే వీడిని పటేలుమని కొట్టాలా!
3. రామ లక్ష్మణులు అడవికేగిరి.
4. మా నాన్న ప్లీడరీ పట్టా భిన్నమైంది.
5. కంసాలి క్షీరసాగరం గాజులు తెచ్చాడు.
6. మధ్యాహ్నంవేళ సూర్యునిప్రకాశం చాలా తీక్షణంగా వుంటుంది.
7. పాపం! ఆమాట విని కాంచనమాల వ్యాకుల పడ్డది.
8. అమ్మబాబో! సుబ్బిసెట్టి మళ్లీ వచ్చాడు! ఏందారి?
9. ఒరేయ్ రాజా! జీతంవచ్చేక నాబాకీ తీర్చరా!
10. మాబావ బెల్గాం ధీమాగా వెళ్లేడు. ఎల్. ఎల్. బి. చదువుదామని.

కూర్పు: ఆరాధ్యుల సీతాదేవి (తెన్నారు)

(జవాబులు ఈ సంచికలోనే)



మంచి ముత్యాలు, కెంపులు, నీలాలతో అసలు సవరపు
* బంగారుతో చేయబడిన కొత్త రకము కమ్మలు. *

KOTA NARSIMHULU CHETTY & SON.
217/3, China Bazar Madras-1.



# తాన్‌సేన్ పాట

రచన : "ఒకబాల"

బాలా! బలే తమాషా కథ చెప్తాను. కథకాదు; నిజమే! అక్బరు చక్రవర్తి రాజ్యంలో, అతని ఆస్థానంలో అనేకమంది విద్వాంసులు వుండేవారు. అందులో పేరుగన్నవాడు తాన్‌సేన్ అనే గొప్పగాయకుడు.

తాన్‌సేన్ ఒక పల్లెటూరిలో పుట్టాడు. చిన్నప్పటినుంచీ చక్కని పాటలు పాడుతూ వుండేవాడు. ఏధ్వని అయినా ఒకసారి విన్నాడంటే చాలు సరిగ్గా అదే విధంగా తాన్‌సేన్ తన గొంతుకతో పలికేవాడు. పిల్లి అరుపు, కుక్క మొరుగు; ఆవుల అంబాలు-ఏ అరువు అయినా సరిగ్గా అలాగే అరిచేవాడు. ఊళ్లో వాళ్లు యీతని అద్భుత శక్తికి ఎంతో మెచ్చుకొనేవారు. అంత చిన్న వయస్సులో అంత తమాషాగా తన గొంతుకతో పాడడం, అరవడంచూచి తాన్‌సేన్ చాలా గొప్ప విద్వాంసుడవుతాడని అందరూ అనేవారు.


తాన్‌సేన్ తాతగారికి వూరిబయట చక్కని మామిడితోట వుండేది. అది చాలా పెద్దతోట. బాటసారుల త్రోవ ప్రక్కనే వుండేది ఆతోట. అందుమూలంగా ఆదారిని బోయే బాటసారులు, సన్యాసులు తోటలోకి వచ్చి కాసేపు చెట్లక్రింద విశ్రాంతి తీసుకొని వెళుతూ వుండేవారు. కాయలు పండేకాలంలో ఒక్కకాయకూడా వుండేదికాదు! కాపలా ఎవ్వరూ లేకపోవడము మూలంగా వచ్చిన వాళ్లంతా వాళ్లకు తోచినన్ని కాయలు కోసుకు పోతూ వుండేవారు. అంచేత తాన్‌సేనుని ఆతోటకు కాపలాగా పెట్టారు వాళ్ల తాత. అప్పటికి తాన్‌సేనుకి పదిహేను

పదహారేళ్లుంటాయి.

బాటసారులు మామూలుగా వచ్చి ఆతోటలో చెట్లక్రింద పడుకున్నారు. కొందరు మామిడి కాయలు దొంగలాడాలని చెట్లు ఎక్కబోతున్నారు. ఈలోపుగా తాన్ సేన్ ఏమిచేశాడో తెలుసా? చెట్లకొమ్మల్లో దాగొని ఒక సింహంలాగ అరవడం మొదలెట్టాడు. చెట్లక్రింద పడుకున్న వాళ్లంతా సింహము వచ్చిందని తలక్రింద మూటలు తీసికొని పరుగెత్తారు. ఆ మర్నాడుకూడా అలాగే! రోజూ రాత్రిళ్లు తాన్ సేన్ అలాగ సింహపు అరుపు అరుస్తూ వుండేవాడు. తోటలో సింహము వుంటున్నదని భయపడి బాటసారులు ఎవరూ తోటలోకి పోయేవాళ్లుగాదు. చూశారా తాన్ సేన్ తెలివి!




ఒకసారి అక్బరు పాదుషా ఆత్రోవనేపోతూ వుండగా తాన్ సేన్ సింహం అరుపు అరిచాడు. ఆ సింహపు గర్జనవిని, సింహాన్ని చంపుదామని ఆ రాజుతోటలోకి ఆధ్వని వచ్చేదిక్కుగా పోయాడు. తోట మధ్యలోకి పోయేటప్పటికి అక్కడ తాన్ సేన్ చెట్టుమీద కూర్చుని అరుస్తూ వున్నాడు! అతని నేర్పుకు మెచ్చుకొని అతనిని తీసికెళ్లి ఆస్థానగాయకుణ్ణిగా నియమించుకున్నాడు. చూశారా తాన్ సేన్ ఎంత గొప్పవాడో!




భీమ్మడు: ఒరేయ్ దమ్మా "బాల" పత్రిక తెప్పించాలనివుంది—కాని దానియడ్రసు తెలియదు ఎలాగ?

దమ్మడు: ఒస్ ఆపాటిదానికే! ఎడ్రసు కావలిస్తే 'బాల' మేనేజరుగారికి ఒక కార్డు రాసి ఎడ్రసు తెప్పించుకో!

—మోస చక్రపాణి (అనకాపల్లి)

దంతము లన్నిటిలోకీ
ఏనుగు దంతం ఉత్తమమైనది

కర్పూరము లన్నిటిలోకీ 'గడియారంమార్కు'
కర్పూరము ఉత్తమమైనది.

**గడియారంమార్కు కర్పూరం అన్నిషాపులలోను దొరుకుతుంది.**
**లేదా, యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.**

గోపాల్‌జీ చాంపషీ అండ్ కో.,
**80,** గోవిందప్పనాయక్ వీధి, జి. టి. మదరాసు 1.

పిల్లలబాధలు
పెద్దల తలనొప్పులు

గజ్జి, కురుపులు, దురదలు, దెబ్బలు, గోకుడుపుండ్లు, చీముపుండ్లు, కాలినపుండ్లు మొదలగు చర్మవ్యాధులను పోగొట్టి విషక్రిములను చంపి బాధలను తొలగించుదివ్యమైన మందు.

శ్రీవత్సావారి స్కిన్‌డెక్సు

వివరములకు :

శ్రీవత్స కెమికల్సు & డ్రగ్సు లిమిటెడ్
( మందులను తయారుజేయు సంస్థ )
**72, గోవిందప్పనాయక వీధి. మదరాసు 1.**

# V జ్ఞాన V ంత V నోద పGల్

జవాబులు ఈ సంచికలో నేవున్నా మీరుమాత్రం చూడకండేం?

బాలలూ! ఈక్రింద వరసగా మీకావలసిన ఆధారా లున్నాయి. వాటికి సరిపోయే పదాలను (ఒక ఆధారానికి ఒకపదం మాత్రమే!) జవాబులు చెప్పాలి. జవాబుల్లో ప్రతి పదంలోనూ ఒక్కటైనా ఇంగ్లీషు అక్షరం తప్పకవుండాలి. ఏదీ ప్రయత్నించండి చూద్దాం!

ఆధారములు

1. పిల్లికి బలే ఇష్టం! ( A లుక)
2. ముష్టివాడు.
3. మృగరాజు.
4. హిందూదేశ ముఖ్యపట్టణం.
5. మృగాలను దీనితో పొడిచి చంపుతారు.
6. ప్రాణి.
7. ఎక్కువ.
8. ఒక పర్వతము.
9. దేవుడు.
10. చేతులు.
11. శిల్పచాతుర్యం వుట్టిపడుతూన్న గుహాల్లో ఒకటి.
12. ఆంధ్రదేశంలోని ఒకవూరు.
13, సూర్యుని ప్రభావం ఎక్కువగా వుంటే యిదికూడా ఎక్కువగా వుంటుంది.
14. పిల్లకు చదువులో యిది అవసరం.
15. మతిస్థిమితము లేనివాడు.
16. సినిమా బుక్కింగ్ ఆఫీసు దగ్గర ఈపద్ధతి అవలంబిస్తే మంచిది.
17. ద్రావిడుల తర్వాత మన దేశానికి వచ్చినవారు.
18. తేనీరు.
19. దేశపురోభివృద్ధికి వీరిసహాయం ఎంతైనా అవసరం అని అంటాడు మన నెహ్రూ).
20. ఈ పజిల్ మీకు యిదిగా వుందికదూ!
21. ఈ యంత్రంద్వారా మన శరీరంలోని భాగాల్ని పరిశీలిస్తారు డాక్టర్లు.
22. వైద్యుడు చేయువృత్తి.
23. ,N' ను ప్రక్కకు త్రిప్పగా వచ్చే ఇంగ్లీషు అక్షరం.

—ఎస్. శ్రీరాం, (మదనపల్లె)

# మా కథ!

అమ్మా నాన్నా నేనూ చెల్లీ ఆయింట్లో వుంటూండేవాళ్లం. మాకాయిల్లం టేయెంతోయిష్టం. ఆడుకోడానికి పెద్దతోట వుండేది.

వూరికొంత దూరంలో మానాన్న అభ్రకంగని తవ్విస్తూండేవారు. అందరిలాగే నాన్నకూ చాలాడబ్బు వస్తుందనీ, మేమూ యేమిటేమిటో కొనుక్కోవచ్చునని నేనూ చెల్లీ అనుకునేవాళ్లం.

యింతలో యెవరో పిల్చారు నాన్నని. ఆ వచ్చినాయన అరిచి అరిచి మాటాడాడు; "నాడబ్బు ఏంచేస్తావ్!" అని. అమ్మ విచారంగావుంది. మేము యెందుకో భయపడ్డాం. అమ్మ మమ్మల్ని తీసికెళ్లి పడుకోపెట్టింది.

రాత్రి నిద్రలో అమ్మ లేపితే లేచాము. అమ్మచేతిలో ఒక చిన్న పెట్టివుంది. అమ్మ వాకిటి తలుపు మూసి తాళంవేసింది.

ఒకనాడురాత్రి నేను పాఠాలు చదువుకుంటూంటే కన్నతల్లి వూరికే గొడవ పెడ్తూంది చదవనీకుండా! పెద్దకేక విని తిరిగిచూస్తే నాన్న చాలా చికాగ్గా కనిపించారు. అమ్మవచ్చి భోజనం చెయ్యమంటే చెయ్యనన్నారు. అమ్మ పళ్లెంలో భోజనం తెచ్చింది. నేను నాన్నకు టేబిల్ వేసాను. పాప తాను కలిపిపెడ్తాను, తినమని బ్రతిమాలింది.



'నాన్నకు అన్నం పెట్టాము'

నాకేమీ అర్థంకాలా! "ఎక్కడి కమ్మా ?" అని అడిగాను. "గని దగ్గరకు నాన్నా" అంది. అమ్మ కళ్లల్లో నీళ్లు కనిపించాయి. నాకూ ఏడుపొచ్చింది.

మేము గనిదగ్గర ఓగుడిసెలో వున్నాం. అక్కడ వెంకన్న తాత పాపం యెంతో దయగా చూసుకునేవాడు. నాన్న యెప్పుడూ చిరాగ్గా వుండేవారు. మామూలులాగ సిగరెట్లుకూడా కాల్చేవారుకారు. అమ్మదిగులుగా వుండేది. కొద్దిరోజులు యిలాగే వున్నాం.

ఒకనాడు వెంకన్న తాత గనిలో ఒక మూల తవ్వడం ఆరంభించాడు. అమ్మకూడా తవ్వింది పాపం. నేనూ చెల్లాయి బుట్టలలో మట్టి మోస్తున్నాం. అభ్రకం దొరికిందని పరిగెత్తుకుంటూ నాన్నదగ్గరకి వెళ్లాం. మాకందరికీ చాలా సంతోషమైంది. జాక్ మామయ్యకూడా వచ్చాడారోజుని. జాక్ మామయ్యంటే యేమనుకున్నారో! బలే సరదా మనిషి!

అభ్రకం వ్యాపారంలో నాన్నకి చాలా డబ్బువచ్చింది. పెద్ద పెద్ద కారులూ మాకు బోలెడన్ని ఆటవస్తువులు కొన్నారు. ఓ పెద్దమేడ కట్టించారు. అందులోకి మేము వెళ్లిననోజు పెద్ద పండగ. ఊళ్లో వాళ్లందరూ వచ్చారు. అమ్మా, నేనూ, చెల్లాయియెంతో బాగా ముస్తాబుచేసుకున్నాం. ఆరోజున గనిలో పనివాళ్లందరూ ఓతమాషా నాటకం వేశారు. కానీ ఆరోజున డాన్సే మాకు మరీ బాగుంది. అనూరాధ అని ఒక ఆవిడ డాన్సుచేసింది. మళ్లీ మళ్లీ చూడాలనేంతగా



"మాకు బోలెడు ఆటవస్తువులు!"

వుంది ఆడాన్ను.

అమర్నాడు నాన్న మద్రాసు వెళ్లారు. ఎన్నోరోజులైపోయింది. రాలేదు. రోజూ వస్తారని యెదురు చూస్తూవుండేవాళ్లం. ఒక రోజు వచ్చారు. కానీ వచ్చిం దగ్గ ర్నుంచీ చాలా కోపంగానే వున్నారు. ఎప్పటిలాగ మమ్మల్ని దగ్గరకు పిలవలేదు!

మరుసటిరోజు ప్రొద్దున తోటలో ఆడుకుంటున్నాం. ఎవరో కార్లో రావడంచూచి లోపలికి వెళ్లాను. అల్లారోజుని డాన్సుచేసినావిడ వచ్చిందని చెప్పాడు వంట సుబ్బయ్య. నాకు సంతోషంవేసి మేము పైకి వెళ్లాము. ఆవిడ పక్కకూచుని మాటాడాను. ఆవిడ చేతిలో నాన్న ఉంగరం చూచాను! యిది మీకెలా వచ్చిందని అడిగాను. నాన్న గదమాయించి కిందికివెళ్లమన్నారు.

కొంతసేపటికి నాన్న అమ్మని తిట్టడం విని నేనూ పాపాయి మా గదిలోనుంచి యివతలకి వచ్చి, గోడచాటున నిలబడ్డాం చూస్తూ, అమ్మని బెదిరించి మాటాడారు నాన్న. చివరకు లెంపకాయకొట్టి మేడపైకి వెళ్లిపోయారు. పాపం! అమ్మను చూచిన నాకు ఏడుపొచ్చింది.

మేడపైకి వెళ్లాను. "ఏమండీ నాన్నగారూ! అమ్మ నెందుకండీ అలా ఏడిపిస్తారు?" అని కోపంగా అడిగాను. భుజంపట్టుకుని దబదబలాక్కొచ్చారు నన్ను. మెట్లమీదనుంచి తోసారు. అమ్మ పట్టుకుంది. తర్వాత ఆ రాత్రి చెల్లాయినికూడా కొట్టి తరిమారు అలాగే.

ఆరోజు రాత్రి అమ్మ నన్నూ, పాపను తీసుకుని బయలుదేరింది. ఎక్కడికో నాకర్థం కాలేదు. రైలెక్కాం. మద్రాసులోదిగాం. అప్పట్నుంచీ పాపం, అమ్మ పొద్దునవెళ్లి తిరిగి తిరిగి సాయంకాలం వచ్చేది యింటికి. ఒక రోజు యెవరో గొప్పాయన యింటికి వెళ్లాం. ఆయన జడ్జీగారట. చాలా మంచివారు. ఆయన కూతుళ్లిద్దరూ, సుశక్క-శశక్క అని పిలిచేవాళ్లం. ఎంత మంచి వాళ్లనుకున్నారు. మమ్మల్నెంతో సరదాగా చూచుకునేవారు.

ఇలా వుంటూండగా, ఒక నాడు అమ్మా, నేనూ, చెల్లాయి

ఏదో ఆఫీసుకు వెళ్లాం. దానిపేరు కోర్టుట. అక్కడ చూస్తే ఎత్తైన కుర్చీమీద మాకు తెలిసిన తాతగారే కూర్చున్నారు. అటూ యిటూ చూస్తే చాలా మంది నల్లకోట్లు వేసుకుని కూర్చునివున్నారు. వాళ్ల మధ్య నాన్న



"అమ్మదగ్గరే వుంటాము" అని చెప్పాము.

గారు, గుమస్తా శంకరంగారూ కూడా కనిపించారు. నాన్నగారూ మమ్మల్ని దగ్గరికి పిలవలేదు. అమ్మతోకూడా మాటాడలేదు. మాకు నాన్నగారిమీద బలే కోపంవచ్చింది. నాన్న పిలిస్తేకూడా దగ్గరికి వెళ్లకూడదనుకున్నాం! అక్కడ పెద్దవాళ్లంతా యేవేవో మాటాడారు. చివరకు జడ్జీ తాతగారు మమ్మల్ని పిలిచి, "ఏం పాపలూ! మీనాన్నగారు మిమ్మల్ని తీసుకువెళ్తారట. వెళ్తారా?" అని అడిగారు. "మేం వెళ్లమండి. ఆయన కొడ్తారు. అమ్మదగ్గిరే వుంటాం" అని చెప్పాము నేనూ చెల్లాయి. అయినా మానాన్న మమ్మల్ని లాక్కెళ్లారు! తరువాత మేం పడ్డకష్టాలు, మాకథా రాగిణీవారి "తిరుగుబాటు"లో చూడాల్సిందేకాని ఎలా వ్రాయడం?






## విద్యార్థి విజ్ఞానసంఘం, తెనాలి:

పాతికమంది సభ్యులతో శ్రీ వెలాగా వెంకటప్పయ్యాగారి అధ్యక్షతను ఈ సంఘం నడుప బడుచున్నది. "బాలజ్యోతి" అనే పత్రికను నడుపుటకు యత్నములు జరుగుచున్నవి.

## బాల విద్యార్థి సంఘం, తిరుత్తని:

ఈ సంఘం గత నవంబరు నెలలో పెట్టబడింది. "వీర విద్యార్థి" అనే వ్రాత పత్రికను నడుపుతున్నారు. అధ్యక్షులు జి. మునిరత్నంగారు. కార్యదర్శి పి. దామోదరంగారు. ఈ సంఘం యొక్క బ్రాంచి అరక్కోణము నందు కూడ గలదు.

## స్టూడెంట్సు సేవాసమితి; ఏలూరు:

15 మంది సభ్యులతో ఈ సంఘం పెట్టబడింది. గుడ్ లక్ గ్రంథాలయము కూడా నడిపిస్తున్నారు. కార్యదర్శి: టి. వి. ఎల్. నరసింహారావు.

## శ్రీరామా క్లబ్బు; తుని:

శివరాత్రికి ఆటల పోటీలు జరిగాయి. సాయంత్రం సభకు శ్రీ నారాయణాచార్యులుగారు అధ్యక్షులుగా వుండి, పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చిరి.

## జైహింద్ లైబ్రరీ; మచిలీపట్నం:

జనవరి 26 తేదీని రిపబ్లిక్ దినం చేశారు. మాచే నడపబడుచున్న "ఆంధ్ర మాత"ను మెచ్చుకుంటూ ఫ్రెండ్స్ యూనియను వారు మాకు స్వర్ణపతాకం ఇచ్చారు. ఫిబ్రవరీ 16 తేదీని శ్రీ చెళ్లపిళ్ల కవిగారి నిర్యాణమునకు సంతాపము వెలిబుచ్చుచు సభ చేశారు.

## సరస్వతీ ఆంధ్ర బాలభక్త సంఘం; కలకత్తా.

జనవరి 26 తేదీని రిపబ్లిక్ దినం జరిపాము. మక్కాన్ దొరగారు అధ్యక్షత వహించి, బాలలకు జుబ్బాలు పంచిపెట్టిరి. బాలల ప్రదర్శనములు జరుపబడెను.

## ఆంధ్ర గౌరీ బాలసంఘము; భోగాపురం:

రిపబ్లిక్ దినము జరుపబడింది. విశాఖపట్నం శ్రీ ఆడారి సుబ్రహ్మణ్యంగారు ఉపన్యశించి గాంధిజీవిత చరిత్ర పుస్తకం ఇచ్చారు. జనవరీ 30 తేదీని 'గాంధీ తాతను గురించి శ్రీ దాడి నుసిలి నాయుడుగారు చెప్పారు.

బీద విద్యార్థులకు రాత్రులు చదువు చెప్పుటకు తీర్మానించారు.

## బాలసారస్వతసమితి; రావికమతం

జనవరి 26 తేదీని రిపబ్లిక్ దినం జరిపాము. 30 తేదీని "సర్వోదయ" దినం జరిగింది. ఫిబ్రవరీ 3 వ తేదీనుండి 8 తేదీ వరకు పెద్దవాళ్ల చదువులగురించి సభలు చేసి, పిల్లలు అందులో నాటికలు, నాట్యప్రదర్శనములు చేశారు.

## బాపూజీ బాలసంఘం; విజయనగరం:

ఈ సంఘం ద్వితీయవార్షికోత్సవం జరిగింది. నృత్యాలు, నాటికలు జరిగాయి. చిరంజీవులు చాగంటి జానకీదేవి, రమణకుమార చాలా సహాయము చేసిరి. చి॥ లలిత పద్మినీలకు బహుమతులు ఇవ్వబడెను. సంఘమునకు కొత్త కార్యవర్గములో శ్రీ ఎ. టి. శాస్త్రి, వి. సత్యనారాయణ; కె. దాసు; యం. వి. శర్మ మొదలగు వారున్నారు.

## జమ్మలమడుగు ఆంధ్రకేసరి బాలసంఘము:

రిపబ్లిక్ దినమునే స్థాపించబడింది. శ్రీ ఆర్. వి. శేషన్న అధ్యక్షులు; ఏ. జీవరత్నమ్మ, కొణ్ణాట నాగరత్నం గార్లు కార్యవర్గంలో వున్నారు. కోలాటం, గొబ్బి మొదలగు ఆటలు ఆడపిల్లలు ఆడుచున్నారు.

## బాపూజీ బాలసంఘం; భీమవరం:

ఈ సంఘంవారు 'అబ్బాయి' అనే వ్రాతపత్రికను, బేబీ'' అనీ వ్రాత పత్రికను నడుపుచున్నారు.

## కొత్తపల్లి ఆంధ్రవిద్యార్థి బాలసంఘం:

ఫిబ్రవరీ 8 తేదీన జరుపబడిన ద్వితీయ వార్షికోత్సవములో శ్రీ యం. సూర్యనారాయణగారు, ఆర్. శాంతారావ్, యం. సూర్యప్రకాశరావు గార్లను ఎన్నుకొన్నారు. ఒక గ్రంథాలయం కూడా వుంది.

## ఆంధ్ర బాలానందసంఘము; మదరాసు:

ఈ సంఘమువారు ఫిబ్రవరీ 6వ తేదీని కాకినాడకు వెళ్లి అక్కడ ఇంజనీరింగు కాలేజీ సంఘమువారి ఉత్సవములలో, నాటికలు, నృత్యములు, పాటలు ప్రదర్శించారు.

బాల బాలికల ప్రదర్శనములను మెచ్చుకొని, ఆ కాలేజీ సంఘమువారు ఒక పెద్ద వెండి కప్పును బహుమతి చేశారు. భాగానటించిన పిల్లలందరికీ ప్రత్యేక బహుమతులుకూడా ఇచ్చారు.

8వ తేదీ ఉదయం కాకినాడ టౌను హాలులో ఒక పిల్లల సభ జరిగింది. ఆ సభలో కాకినాడ పిల్లలు మదరాసు పిల్లలకున్నూ, రేడియో అక్కయ్య, అన్నయ్యలకు స్వాగత పత్రం ఇచ్చారు. మదరాసు పిల్లలుకొన్నితమాషా ప్రదర్శనములు చూపారు. పిల్లలందరికి మిఠాయి పంపకంతో నాటి సభముగిసింది.

కాకినాడ బాలలను ఈ విధంగా చేరదీసి ప్రోత్సహిస్తున్న క్లబ్బు అధికార్లకు జేజేలు.

---

కాశమనాయుడు పేటలో 9-2-50 తేదీని వయోజన విద్యాసంఘం స్థాపించబడింది.

---

## పొడుపుకథలు (జవాబులు)

1. చెమటకాయ; 2. కోడిగుడ్డు; 3. భూమి; 4. పట్టెమంచము; 5. వెంట్రుకలు; 6. వక్క, ఆకు, సున్నం; 7. పెంకిపురుగు.

# ప్రశ్నలూ — జవాబులూ

ప్రశ్న :-ఏదైనా చాలా బాగుంటే మనం "ఫస్టుక్లాస్" అంటాము కాని "ఫస్టుఫారం" అని ఎందుకనము?

—యం. వేణుగోపాల్
V ఫారం (ఆదవాని)

జవాబు :-ఫస్టుఫారమైన ప్రశ్న వేశావోయ్ ఫిఫ్తుఫారం బాయ్! "క్లాసు" అనే మాటకి డిక్షనరీలో నానార్థాలు చూచుకో.

ప్రశ్న :-బాలురు ఎంత ఏడిస్తే అంత బలం అంటారు. నవ్వితేనో?

—వి. వీరభద్రం (కాళమనాయుడుపేట)

జవాబు :-ఏడుస్తే బలం, నవ్వితే ఆరోగ్యం, అల్లరిచేస్తే దెబ్బలు!

ప్ర :-తైలామజ్నులోని యెడారి, తుపాను నిజమైనదేనా?

—K. పద్మినీదేవి (ఏలూరు)

జ :-కాదు. దానినే సినిమా తుపాను అంటారు.

ప్ర:-చాలామంది నాన్నా అమ్మలు పిల్లల్ని ముద్దుగా చూస్తారు. మా నాన్నా అమ్మలకు మేమంటే ఎంతో చిరాకుగా చూస్తారు. కారణం?

—కేతినడి శేషగిరిరావు
(విజయనగరం)

జ :-మీరు ముద్దుకి తగరు గనుక.

ప్ర :-భూమి గుండ్రముగా వుంది కదా, భూమియొక్క క్రింది భాగమందు మనుష్యులు తల క్రిందుగా పడిపోక ఎలా వుంటున్నారు?

—పి. బాబూ రాజేంద్ర ప్రసాద్
(రేలంగి)

జ :- భూమికి ఆకర్షణ శక్తి వుంది. ఆకర్షణ అంటే తనవైపు లాగడం అన్నమాట. భూమి మననిలాగి పట్టుకొని వుంటుంది గనుక పడిపోము.

ప్ర :-సముద్రముమీద ప్రయాణముచేస్తే కొందరికి వాంతులు వస్తాయి. ఎంచేత?

—మ. లక్ష్మణస్వామి
పట్నాయక్ (బాపట్ల)

జ :- దానినే "సముద్రపుగాలి రోగము" అంటారు. ఉప్పునీటిగాలి కొందరికి పడక, కడుపులో త్రిప్పి వాంతులు వస్తాయి. అలవాటు అయాక పోతాయి.

### జ్ఞానవింతవినోదపజిల్ (జవాబు)

1. Aలకులు; 2. Bచ్చగాడు; 5. Co ాము; 4. D ల్లీ; 5. Eటే; 6. G.V; . H చు; 8. Iరావతము; 9. J G; 0. K లు; 11. Lలోరా; 12. Mమిగ హారు; 13. Nడ; 14. Oర్వ; 15. Pచ్చి గాడు; 16. Q పద్ధతి; 17. R యులు; 18. T ; 19. U వకులు; 20. V ంత; 21. X రే; 22. Yద్యము; 23. Z.

### దాగుడు నాయకులు (జవాబు)

1. నెహ్రూ; 2. పటేలు; 3. గిరి; 4. పట్టాభి; 5. రంగా; 6. ప్రకాశం; 7. మాలవ్యా; 8. బోసు; 9. రాజాజీ; 10. గాంధ.


రండి ! చూడండి !

## జైహింద్ ఫార్మసీ

మందులు అమ్ము, తయారుచేయు సంస్థ

**7, గోవిందప్పనాయకవీధి, మదరాసు 1.**

(ఆర్యభవనమునకు ప్రక్కనే)

అన్నిరకముల పేటెంటు మందులు; టాయిలెట్ సామాన్లు,

అతి సరసమైన ధరలకు దొరకును.

జైహింద్ !



ముత్యములన్నిటిలోకీ

సముద్రపు చిప్పలోదొరికే ముత్యంశ్రేష్ఠం

అలాగే, ఇంగువలన్నిటిలోకీ, తిలక్ మార్కు

ఇంగువ శ్రేష్ఠమైనది.

**తిలక్ మార్కు ఇంగువ అన్నిషాపులలోను దొరుకుతుంది.**

**లేదా, యీక్రింది అడ్రసుకు వ్రాయండి.**

## గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి, * జి. టి. మదరాసు 1.

## బాలానందం

### మార్చి 1950

**4-వ తేదీ శనివారం**

రారండోయ్ (పిలుపు పాట); అక్కయ్య కబుర్లు: "చిట్టికుక్క" - నాటిక; ఎలకపిల్లా - జున్ను ముక్క (కథ); చందమామ పాట; నీ పాటలూ కథలూ; చాలునింక.

**11-వ తేదీ శనివారం**

రారండోయ్ (పిలుపు పాట); అక్కయ్య కబుర్లు; "ఉప్మా" - నాటిక, తేనెపట్టు (కథ); నీమీ పాటలూ అవీ; పొడుపుకథలు; చాలునింక.

**18-వ తేదీ శనివారం**

రారండోయ్ (పిలుపు పాట); అక్కయ్య కబుర్లు; మా ఉగాది కలలు -; "రేపే మన ఉగాది" - పాట, "పో పోరా పాత తాతా! రారావే కొత్త మాత!" - పాట; మెలికి మాట; చాలునింక.

**25-వ తేదీ శనివారం**

రారండోయ్; అక్కయ్య కబుర్లు; "సీతాకళ్యాణం" - నాటిక. గుహుడు పాట;" దశరథుడి శాపం (కథ); చాలునింక.

## ఆటవిడుపు

### మార్చి 1950

**5-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "మేదర సూరి" నాటక; చలిగాడి కథ; "బుజబుజరేకులపిల్ల - బొమ్మల పెళ్లి" - రికార్డులు; బాలవార్తలు; పోదామా.

**12-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "నిమ్మ కన్య" - నాటిక; "వసంతుడా రావోయీ;" - పాట; కొత్తకథ; బాలవార్తలు; మెలికిమాట పోటీ. పోదామా.


**19-వ తేదీ ఆదివారం (ఉగా[illegible]**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "కొత్త - పాత" - నాటిక; ఉగాది సోది; తాతయ్య పంచాంగం; జ్యోతిషం; ముద్దబ్బాయి జాతకం; పోదామా.

**26-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; రామరాజ్యం - నాటిక; హనుమంతుడితో ఇంటర్వ్యూ; బాలవార్తలు; పోదామా॥

ాలా! ఈదిగువ చదరంలోని అక్షరాలు నింపి,
ఉంచుకో! ఒచ్చే నెల 'బాల'లో సరియై
ాడు.




ఆ ధా రా లు

**అడ్డము**

ౌరాది.

)

(అదే)

రి

ాడు దీనిపచ్చడి తింటాము
రణముగా కొందరు ఉత్తర
దీనిని ముందురాస్తారు

దీనినితొక్కి నీరుతోడుతాడు

ేడాది

**నిలువు**

1. పండుగనాడు కొత్త.
   కొంటాము.
2. దిక్కు
3. ఫలము
4. ఒక శరీరభాగము
7. త్రిలింగ (అదే)
8. వినోదము
10. భాగము
12. శ్రీరాముని చిన్నకొడ
13. చిన్ననది
14. ఋషి.

## ౦ాటలతో ఆటలు 4

(జవాబు)

:- 2. కొసరము (లేక) పసరము; ...తావి; 7. మావి; 8. పరి ...ంన; 11. పవలు రేలు (లేక) ...లు రేలు; 13. సాము; 14. గువ్వ ...నకులుడు.

- 1. ప్రతాపము; 3. సమాన ...ము; 4. రవి; 6. విరి; 9. పాద ...ంలు; 10. నలువురు (లేక) పలు ...; 12. రేగు; 13. సాకు.

## తెలివైన బుర్ర (జవాబు)

గోపాలుడు, వాళ్ల నాన్నగారు రాసిన ఉత్తరం గమ్మత్తుగా మడతపెట్టి 98 వున్న అంకెలను త్రిప్పిచూపిస్తాడు. అలా త్రిప్పిచూపిస్తే 86 లాగ కనబడుతుందిగా! అంచేత వాళ్లతాతగారు ఆ అంకె 86 అనుకున్నారని చెప్పి తప్పించుకున్నాడు!

## మాటలు నేర్చుకో (జవాబులు)

1. పులుపు; 2. కులుకు; 3. నటన; 4. కలక; 5. ముఖము; 6. ముత్యము; 7. విరివి; 8. ముదము; 9. కునుకు; 10. గరగ.


పిల్లలకు ఉగాది కానుక




ప్రతిచోట న్యూస్ ఏజంట్లు బుక్ సెల్లర్సు కావలెను.

• ప్రతులు కావలసినవారు ప్రతికాపీకు 0-7-0 పోస్టేజిబిళ్లలు పంపవలెను.

బుజ్జాయిరాం పబ్లికేషన్సు, 7, నాగేశ్వరరావు రోడ్డు, టి. నగర్, మద్రాసు 17.




...d and Published by N.Raghava Rao & Printed by N.Kameswari ...he "BALA PRESS", 170, Royapettah High Road, Madras-14

నీలాలకళ్లు

రాధా-కృష్ణులు (ఇద్దరూ ఒకరే!)



చి॥ అంగలకుదిటి వసుంధరాదేవి (గుంటూరు)



చి॥ పి. పుల్లారావు (ఏలూరు)

అప్పా! రావూ?



చి॥ ఆర్. అప్పారావు (ఉండి)

ఆటమోటార్!



చి॥ సాయికుమార్ (మచిలీపట్టణం)




Bala Press, Madras 14.